

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 01-02-2025 | సంపుటి - 21 | సంచిక -284 | రూ : 4 | పేజీలు: 8




## అన్ని వర్గాలను
# కాంగ్రెస్ మోసం చేసింది

- 14 నెలలుగా మౌనంగా గమనిస్తున్నా
- నేను కొడితే మామూలుగా ఉండదు
- ఫిబ్రవరిలో భారీ బహిరంగ సభ
- భారాస అధినేత కేసీఆర్

జహీరాబాద్, ములుగు, గజ్వేల్: “రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. నేను ఎన్నో ప్రభుత్వాలను చూశా. కానీ, ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదు. ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమైంది. ఏడాది పాలనలో ప్రజలెవ్వరూ సంతోషంగా లేరు. 14 నెలలు ఓపిక పట్టాం. వాళ్లు చేస్తున్న దుర్మార్గపు పాలనతో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు లేవదీయాల్సిన సమయం ఆసన్నమైంది” అని భారాస అధినేత కేసీఆర్ మండిపడ్డారు. “ఇన్ని రోజులుగా నేను మౌనంగా, గంభీరంగా గమనిస్తున్నా. నేను కొడితే మామూలుగా ఉండదు. గట్టిగా కొట్టడం నాకు అలవాటు. తెలంగాణ కోసమే పుట్టిన భారాస... రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి మేలు జరిగే వరకు రక్షణ కవచంలా నిలుస్తుంది. కష్టపడి రాష్ట్రాన్ని గాడిలో పెడితే 14 నెలల్లో నాశనం చేసి ప్రజలను గోస పెడుతున్నారు” అని కేసీఆర్ మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని భారాస నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను కలిశారు. ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు,

తరువాయి 2లో

## శాసనసభకు రండి..
# తేల్చుకుందాం..

- బలంగా కొట్టడం కాదు... ముందు సరిగ్గా నిలబడండి
- రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది మీరే
- భారాస అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

“కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలలకే రాష్ట్ర పరిస్థితి దిగజారిందా...? కొడితే బలంగా కొడతానంటారా? కేసీఆర్.. బలంగా కొట్టడం కాదు.. ముందు సరిగ్గా నిలబడండి. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో మీకు రాష్ట్రాన్ని అప్పగిస్తే.. దిగిపోయేముందు రూ.7లక్షల కోట్ల అప్పులు మిగిల్చారు.. రైతుబంధుకు మీరు పదేళ్లలో రూ.18 వేల కోట్లు ఇస్తే.. అందులో మిత్తికే రూ.8,500 కోట్లు పోయాయ్.. మీరు నికరంగా ఇచ్చింది రూ.3వేల కోట్లే. రైతుబిడ్డగా నేను సరిగ్గా 60 రోజుల్లో 25.50 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశా. ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసాను మార్చి 31 లోపు బ్యాంకుల్లో జమ చేస్తాం. లెక్కలన్నీ ఫిబ్రవరి ఆరు, ఏడు తేదీల్లో శాసనసభలో పెడతాం.. మీరు అక్కడికి రండి...

తరువాయి 2లో



## ‘నయా ఉస్మానియా’కు
# సీఎం భూమి పూజ

- రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం
- మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, అబిడ్స్: ప్రభుత్వ ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం కల సాకారం కాబోతోంది. హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీఎస్ శాంతికుమారి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు హాజరయ్యారు. “ఇది చాలా

తరువాయి 2లో



## కుంభమేళా తొక్కిసలాటపై న్యాయ విచారణ కమిటీ ఆరా

ప్రయాగ్‌రాజ్, వారణాసి: మౌనీ అమావాస్య సందర్భంగా త్రివేణీసంగమంలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై యూపీ సర్కారు నియమించిన త్రిసభ్య న్యాయ విచారణ సంఘం శుక్రవారం ప్రమాదస్థలిని పరిశీలించింది. సంబంధిత అధికారులతో చర్చలు జరిపింది. అలహాబాద్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ హర్ష్‌కుమార్ సారథ్యంలోని ఈ కమిటీలో మాజీ డీజీపీ వి.కె.గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.కె. సింగ్ సభ్యులుగా

తరువాయి 2లో



## ఎన్నికల కోడ్ ముగియగానే
# ‘మెగా డీఎస్సీ’

- విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- జగన్ పెట్టిన బోధనారుసుముల బకాయిల్ని చెల్లిస్తున్నాం
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో నారా లోకేశ్

అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. మార్చిలో ప్రక్రియ ప్రారంభించి.. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. వైకాపా ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బోధనారుసుముల్ని చెల్లించాలని ఆ పార్టీ నేతలే నేడు ఆందోళనలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. తెదేపా

తరువాయి 2లో





# సైబర్ నేరాల నియంత్రణకు 200 మంది కమాండోలు

- వ్యవస్థీకృత నేర ముఠాలపై ఉక్కుపాదం
- డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తా వెల్లడి
- ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ

అమరావతి: ‘రాష్ట్రంలో సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా ఐటీ క్యాడర్‌ను సిద్ధం చేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది పోలీసులను సైబర్ కమాండోలుగా తీర్చిదిద్దుతాం. కాన్పూర్, మద్రాస్ ఐఐటీల నుంచి 6 నెలల కాలవ్యవధితో కూడిన సర్టిఫికెట్ కోర్సులు వారితో చేయిస్తాం. మిగిలినవారికి శిక్షణ ఇచ్చేందుకు వారిని ప్రధాన శిక్షకులుగా వినియోగిస్తాం.

తరువాయి 2లో

## వైకాపా అరాచకాలపై విచారణకు ప్రత్యేక ట్రైబ్యునల్

- బడుగుల హత్యాకాండ, దాడుల కేసులపై ప్రత్యేక దృష్టి
- తెదేపా కార్యకర్తలు, ఉద్యోగులు, పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసుల తొలగింపునకు చర్యలు
- కడపలో మే 27, 28, 29 తేదీల్లో మహానాడు
- ప్రతి 60 కుటుంబాలకు పార్టీ సాధికార సారథి
- ప్రతి శనివారం నియోజకవర్గాల్లో వినతులు స్వీకరించనున్న ఎమ్మెల్యేలు
- తెదేపా పొలిట్‌బ్యూరో సమావేశంలో నిర్ణయాలు

అమరావతి: పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పాత్రికేయులపై గత వైకాపా ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల్ని వీలైనంత త్వరగా తొలగించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని తెదేపా పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను ఊచకోత కోసిన

తరువాయి 2లో



## ఢిల్లీని ఆప్ రాజకీయ
# ఏటీఎంగా మార్చుకుంది

- రాజధానిలో అభివృద్ధిని నిలిపివేసింది
- ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



దిల్లీ: ఇతర రాష్ట్రాల్లో తమ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఆప్ దేశ రాజధానిని రాజకీయ ఏటీఎంలా మార్చిందని ప్రధాని మోదీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దిల్లీలోని ద్వారకా ప్రాంతంలో జరిగిన ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆప్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇతర రాష్ట్రాలకు తమ పార్టీని వ్యాప్తి చేసేందుకు దిల్లీ వాసుల జేబుల్లోంచి ఆప్ డబ్బును దోచుకుంటోందని, తద్వారా రాజధానిలో అభివృద్ధిని అడ్డుకుంటోందని ప్రధాని ఆరోపించారు. దిల్లీ అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ సర్కారును ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు. “ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని ఆప్ అడ్డుకుంటోంది. దిల్లీలో పేదల కోసం కేంద్రం నిర్మించిన ఇళ్లను ఆప్ కేటాయించడం లేదు. రూ.కోట్లతో శీష్‌మహల్‌ను నిర్మించుకున్నవారికి ఈ పేదల బాధ అర్థంకాదు. భాజపా గెలిస్తే పేదలకు సొంతిల్లు కల తీరుతుంది. మొదటి

తరువాయి 2లో

# శాసనసభకు రండి.. తేల్చుకుందాం..

(మొదటిపేజీ తరువాయి)

తేల్చుకుందాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతుభరోసా ఇవ్వలేదంటూ కేసీఆర్ చేసిన విమర్శలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని మాటలు చెప్పడం కాదని, దమ్ముంటే.. అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు. ''ముందు మీ కుమారుడిని, మేనల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి'' అని అన్నారు. ''టిక్‌టాక్ సర్వేలో సీఎం రేవంత్ కంటే తనకే ఎక్కువ లైకులు వచ్చాయంటూ కేసీఆర్ కార్యకర్తలతో చెప్పుకొంటున్నారు. గతంలో టిక్‌టాక్ సర్వేలో సల్మాన్‌ఖాన్ కంటే రాఖీ సావంత్‌కు ఎక్కువ లైకులు వచ్చాయి. రాఖీ సావంత్ మరి సల్మాన్ కంటే ఎక్కువంటే సరిపోద్దా? వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధిద్దాం''అని వ్యాఖ్యానించారు.

* **విద్యను కార్పొరేటీకరించడానికి నేను వ్యతిరేకం**

పదేళ్లలో కేసీఆర్ అనుసరించిన విధానాలతో పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకూ అన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయించాం. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాం. విద్యను కార్పొరేటీకరించడానికి నేను వ్యతిరేకం. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ప్రైవేటు, కార్పొరేట్‌కు అవకాశాలివ్వబోం.. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.

* **మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహించండి..**

150 సంవత్సరాల చరిత్ర కలిగిన మొగిలిగిద్ద పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొనడం నా అదృష్టం. మాజీ ముఖ్యమంత్రులు బూర్గుల రామకృష్ణారావు, చెన్నారెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి ఇక్కడే చదువుకున్నారు. పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ కోరిక మేరకు ఈ పాఠశాల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నా'' అని సీఎం ప్రకటించారు. ''పదోతరగతి తర్వాత విద్యార్థులు సాంకేతిక విద్య చదువుకునేందుకు వీలుగా ఇక్కడే అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభించనున్నాం. మైనార్టీ కమ్యూనిటీ హాల్ ఇవ్వనున్నాం. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మరింతగా అభివృద్ధి చేయనున్నాం. ఈ మట్టిలోని మాణిక్యాలను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే.

* **సింగపూర్... స్టాన్‌ఫర్డ్ వర్సిటీలతో ఒప్పందం..**

ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు మహాత్మాగాంధీ నిర్వహించిన యంగ్ ఇండియా పత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించాం. విదేశీ విద్యా నిపుణులు ఇక్కడి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు సింగపూర్ యూనివర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. స్టాన్‌ఫర్డ్ వర్సిటీతో కూడా ఒప్పందం కుదుర్చుకుంటున్నాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, దామోదర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది

(మొదటిపేజీ తరువాయి)

భారాస శ్రేణులు, అభిమానులు కేసీఆర్‌ను కలిసేందుకు సోమవారం నుంచి శుక్రవారం వరకు 140 కి.మీ. దూరం కాలినడకన ఎర్రవల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ... ''భారాస హయాంలో ప్రాజెక్టుల ద్వారా సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇచ్చాం. కరోనా సమయంలోనూ రైతుబంధు ఆపలేదు. మన హయాంలో చెరువులు బాగు చేసుకున్నాం. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేసుకున్నాం. నేను ముందే చెప్పా. అయినా... ప్రజలు వినలేదు. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓట్లేశారు. వాళ్లొస్తే... 'రైతుబంధుకి రామ్‌రామ్, దళితబంధుకి జైభీమ్' పలుకుతారని ఆనాడే చెప్పా. ప్రాజెక్టుల పనులను చేయకుండా పంట పొలాలను ఎండ బెడుతున్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలవలేదు? ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కాంగ్రెస్ వాళ్లు దొరికితే ప్రజలు కొట్టేటట్లు ఉన్నారు. కరెంటు కోతలు, మంచినీటి సమస్యలు మొదలయ్యాయి. భారాస హయాంలో ఏటా రూ.15 వేల కోట్ల ఆదాయం పెరిగితే... ఇప్పుడు రూ.13 వేల కోట్ల ఆదాయం తగ్గిందని కాగ్ నివేదిక చెబుతోంది. విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సిన డబ్బులనూ ఇవ్వడం లేదు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారు. భారాస పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రక్షణ కవచంలా నిలుస్తుంది. రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో విజయం మనదే. ఫిబ్రవరిలో భారీ సభ పెడదాం. అంతా తరలిరావాలి'' అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, జహీరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, సంగారెడ్డి డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్, సంగారెడ్డి, జహీరాబాద్ మున్సిపాలిటీల భారాస మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# 'నయా ఉస్మానియా'కు సీఎం భూమి పూజ

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రాత్మక దినం. 30 ఏళ్ల కల నెరవేరబోతోంది. కొత్త ఆసుపత్రి రోగులకు ఒక భరోసా ఇస్తుంది. అన్ని రకాల అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి'' అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కొత్తగా జెరియాట్రిక్, పాలియేటివ్, ట్రాన్స్‌ఫ్యూజన్, అడ్మినిస్ట్రేటివ్, రుమటాలజీ, ఫిజియోథెరపీ, అత్యవసర మెడిసిన్, జెనెటిక్స్ విభాగాలు రానున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా...చిన్న చిన్న వ్యాపారాలు దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ''నాలుగు వైపులా విశాలమైన రహదారులు నిర్మించనున్నాం. దీంతో ఇక్కడ వ్యాపార, ఇతర కార్యకలాపాలు మరింత పెరగనున్నాయి. ఆసుపత్రి పక్కనే ఉన్న పోలీస్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ నిర్మించి...అత్యవసర పరిస్థితిలో రోగులను ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు వాడుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వచ్చే రెండేళ్లలో కొత్త భవనం పూర్తి చేయనున్నాం. తెలంగాణలో తొలిసారి ఎక్కువ మంది వైద్యులు శాసనసభ్యులుగా గెలిచారు. వారు కూడా కొత్త భవనం కావాలని కోరుకుంటున్నారు'' అని మంత్రి వివరించారు.

# వైకాపా ప్రభుత్వ అరాచకాలపై విచారణకు ప్రత్యేక ట్రైబ్యునల్

(మొదటిపేజీ తరువాయి)

ఘటనల్లో నిందితులు చాలా మంది తప్పించుకు తిరుగుతున్నారని, ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి ఆ కేసులపై విచారణ వేగంగా పూర్తయ్యేలా చూడాలని నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో అంతర్వేదిలో రథం దగ్ధం, రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం తల తొలగించడం సహా దేవాలయాలపై దాడులకు సంబంధించిన కేసులన్నీ బయటకు తీసి, నిందితులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి అనితకు పొలిట్‌బ్యూరో సూచించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన పొలిట్‌బ్యూరో సమావేశం శుక్రవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో నాలుగున్నర గంటలపాటు జరిగింది. పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు, సంస్థాగత అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. చంద్రబాబు గంటా నలభై నిమిషాల పాటు పార్టీ మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్నీ చదువుతూ, వాటిలో ఎన్ని అమలయ్యాయి, మిగతా వాటిని ఎప్పటికి అమలు చేయనున్నారు అని సమీక్షించారు. ఆ హామీల్లో ఇప్పటి వరకు 60 శాతం పైగా అమలు చేశామన్నారు. అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు కర్మాగారానికి నిధులిచ్చిన కేంద్రానికి, వాటిని సాధించిన చంద్రబాబుకు పొలిట్‌బ్యూరో ధన్యవాదాలు తెలిపింది. పార్టీ చరిత్రలో మొదటిసారి సభ్యత్వాలు కోటి దాటేలా కృషి చేసిన లోకేశ్‌ను అభినందించింది. బాలకృష్ణతోపాటు 'పద్మ' పురస్కారాలకు ఎంపికైన తెలుగువారికి అభినందనలు తెలిపింది. పొలిట్‌బ్యూరో నిర్ణయాల్ని మంత్రి అచ్చెన్నాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విలేకర్లకు వివరించారు. ముఖ్యాంశాలివీ..

**కడపలో మహానాడు**

* ఈసారి మహానాడు మే 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తారు. రెండో రోజు పార్టీ జాతీయ అధ్యక్షుణ్ని ఎన్నుకుంటారు. మూడో రోజు భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. రాష్ట్ర విభజన తర్వాత ఇంత వరకు రాయలసీమలో మహానాడు జరగలేదు కాబట్టి ఈసారి కడపలో నిర్వహించాలని నిర్ణయం
* ప్రతి 60 కుటుంబాలకు పార్టీ తరఫున ఒక సాధికార సారథి నియామకం.
* కుటుంబ సాధికార సారథులు, యూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జుల నియామక ప్రక్రియ ఫిబ్రవరి 6న ప్రారంభం.
* మహానాడు నాటికి బూత్, క్లస్టర్, యూనిట్, గ్రామ, మండల కమిటీలు, కార్పొరేషన్లలో డివిజన్ కమిటీలు, మున్సిపాలిటీల్లో వార్డు కమిటీలు, శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గ కమిటీలు, అధ్యక్షుల నియామకం పూర్తి.
* పార్టీ జాతీయ అధ్యక్షుడు, మంత్రులు సహా ప్రతి ఒక్కరూ ఈ కమిటీల్లో ఏదో ఒకదానిలో సభ్యులుగా ఉంటారు. వాటిలో సభ్యులకే నామినేటెడ్ పదవులు.
* పొలిట్‌బ్యూరో, రాష్ట్ర కమిటీ, ఎమ్మెల్యేలతో తరచూ సమావేశమవ్వాలని సీఎం నిర్ణయం.

**ప్రతి ఎమ్మెల్యే శనివారం వినతులు స్వీకరించాలి**

* నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అందుబాటులో లేకపోవడంతోనే ప్రజలు అర్జీలు తీసుకుని కేంద్ర కార్యాలయానికి వెల్లువలా తరలివస్తున్నారు. దాని వల్ల పార్టీ కార్యకర్తలకు కొంత అసౌకర్యం కలుగుతోంది. ఇకపై అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రతి శనివారం ఎమ్మెల్యేలు ప్రజల నుంచి వినతులు స్వీకరించాలి. పార్టీ కేంద్ర కార్యాలయంలో కూడా శనివారం మాత్రమే వినతుల స్వీకరణ ఉంటుంది. ఆ రోజు మంత్రులు అందుబాటులో ఉంటారు. మిగతా రోజుల్లో వినతులు ఇవ్వడానికి వచ్చేవారి కోసం ప్రత్యేక డెస్క్, డ్రాప్ బాక్స్‌లు వంటివి ఏర్పాటు చేస్తారు.
* ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లా సమీక్ష సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లినప్పుడు, దానికి ముందు రోజు కచ్చితంగా కూటమిలోని మూడు పార్టీల నేతలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలి. కార్యకర్తలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించాలి.
* అగ్రిగోల్డ్ బాధితులకు వారు నష్టపోయిన మొత్తానికి సరిపడా.. ఆ సంస్థకు చెందిన భూముల్ని పరిహారంగా ఇవ్వాలన్న ప్రతిపాదనపై చర్చ
* స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపునకు చర్యలు.
* పార్టీ కార్యకర్తలకు ఉపాధి హామీ పనుల బకాయిలు వీలైనంత త్వరగా చెల్లించాలి.
* ప్రతి జిల్లా కేంద్రంలో ఏడాదిలోగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించాలి.
* మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాను విభజించి, పోలవరం విలీన మండలాల్ని కలిపి ప్రత్యేక జిల్లా ఏర్పాటు ప్రతిపాదనలపై చర్చ.

**అమరావతిలో కిమ్స్ ఆసుపత్రి**

* రాజధాని అమరావతిలో కిమ్స్ సంస్థ ఆసుపత్రి, వైద్యకళాశాల ఏర్పాటుకు ముందుకొచ్చిందని, వినుకొండలో 700 ఎకరాల్లో వైద్య రంగంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించిందని వెల్లడించిన సీఎం.
* గ్రీన్ ఎనర్జీకి అత్యధిక ప్రాధాన్యం. రాబోయే రోజుల్లో ఆర్టీసీలో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే ఉండేలా చర్యలు.
* రాష్ట్రానికి త్వరలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు. ఏడున్నర లక్షల మందికి ఉపాధి.
* ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా శ్రీశైలం అభివృద్ధి.

**విస్తృతంగా డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు.**

* వైకాపా సర్కారు హయాంలో నియమించినవారే ప్రభుత్వ న్యాయవాదులుగా కొనసాగుతుండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారు కొన్ని కేసుల్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం. వీలైనంత త్వరలో వారిని తొలగించి కొత్తగా న్యాయవాదుల్ని నియమించాలని నిర్ణయం.

**గనుల 'ఘనుల'పై చర్యలు**

* వైఎస్ జగన్ సోదరుడు వెంకటరెడ్డికి గనుల లీజు మంజూరు చేస్తూ కనుమ పండుగ రోజు ఉత్తర్వులు జారీ చేయడంపై చర్చ. గనులశాఖ డైరెక్టర్ స్థాయిలోనే అనుమతులు జారీ అయ్యాయని, వెంకటరెడ్డితోపాటు మరికొందరికి కూడా లీజులు మంజూరు చేశారని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి. డైరెక్టర్ స్థాయి అధికారి ఒకరిపై చర్యలు తీసుకుంటే మిగతావారంతా దారికి వస్తారన్న సీఎం. బాధ్యులపై చర్యలకు ఆదేశం.

**జూన్‌లోగా మిగతా హామీల అమలు**

* వైకాపా ప్రభుత్వ నిర్వాకం, ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు కూడా దొరకని పరిస్థితిపై చర్చ. జీఎస్‌డీపీలో 15 శాతం వృద్ధి సాధిస్తేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మళ్లీ కుదుటపడుతుందన్న సీఎం.
* ఆర్థిక సమస్యలున్నా జూన్‌లోగా సూపర్ 6లోని మిగతా మూడు హామీల అమలు.
* ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.

## ఎన్నికల కోడ్ ముగియగానే 'మెగా డీఎస్సీ'

(మొదటిపేజీ తరువాయి)

పొలిట్‌బ్యూరో సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన లోకేశ్ విలేకర్లతో కాసేపు ముచ్చటించారు. విశేషాలివీ..

**తెదేపా హయాంలోనే 80% ఉపాధ్యాయ పోస్టులు భర్తీ**

విద్యాశాఖలో ప్రతి నిర్ణయంలోనూ ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయ సంఘాలతో నిత్యం సంప్రదిస్తున్నాం. ప్రతి శుక్రవారం పాఠశాల విద్య కమిషనర్ వారికి అందుబాటులో ఉంటున్నారు. నేనూ కలుస్తున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రల్లో 80 శాతం ఉపాధ్యాయ పోస్టులు తెదేపా హయాంలోనే భర్తీ అయ్యాయి.

**రూ.800 కోట్లు విడుదల చేశాం**

వైకాపా ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.3 వేల కోట్ల బోధన రుసుముల్లో తొలివిడతగా రూ.800 కోట్లు విడుదల చేశాం. జగన్ పెట్టిన ధాన్యం, ఆరోగ్యశ్రీ బకాయిలు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల్నీ చెల్లిస్తున్నాం.

**ఉపాధ్యాయ బదిలీలకు కొత్తచట్టం**

ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించేందుకు కొత్త చట్టం తెస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ల నివారణకు ప్రత్యేక వ్యవస్థ, విద్యార్థుల సంఖ్యను కచ్చితంగా తెలుసుకునేందుకు అపార్ కార్డు విధానాల్ని తెస్తున్నాం.

**వాట్సప్ గవర్నెన్స్‌కు మంచి స్పందన**

వాట్సప్ గవర్నెన్స్‌కు ప్రజల్లో మంచి ఫీడ్ బ్యాక్ వస్తోంది. అక్కడక్కడా చిన్నపాటి సమస్యలున్నా వారం రోజుల్లో పూర్తిస్థాయిలో అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి. మరిన్ని సేవల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చట్టసవరణ సైతం చేస్తాం. రాబోయే ఆరు నెలల్లో 520 రకాల సేవల్ని అందుబాటులోకి తెస్తాం.

**పార్టీ శ్రేణుల ఎదుగుదల కోసమే ఆ ప్రతిపాదన**

పార్టీ నాయకులు, శ్రేణుల ఎదుగుదల కోసమే 'ఒక వ్యక్తి ఒక పార్టీ పదవిలో మూడుసార్లు కంటే ఎక్కువ ఉండకూడదు' అనే ప్రతిపాదన తెచ్చాం. విస్తృత చర్చ తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటాం. బూత్ కన్వీనర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కావాలి. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలి. అందుకే ఈ విధానం.

**పోలీసు దిగ్బంధంపై లోకేశ్ అసహనం**

పార్టీ కేంద్ర కార్యాలయంలో పోలీసుల్ని పెద్ద ఎత్తున మోహరించడం, కార్యకర్తలు ఇబ్బందులు పడటంపై లోకేశ్ అసహనం వ్యక్తం చేశారు. భద్రతావిధులు నిర్వహిస్తున్న ఉన్నతాధికారుల్ని పిలిపించి మాట్లాడారు. పొలిట్‌బ్యూరో సమావేశానికి ఇంతమంది పోలీసులు అవసరమా అని ప్రశ్నించారు. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే పార్టీ శ్రేణుల్ని బందోబస్తు పేరుతో ఇబ్బంది పెట్టొద్దని, ఇన్‌విజిబుల్ పోలీసింగ్ చాలని సూచించారు.

## సైబర్ నేరాల నియంత్రణకు 200 మంది కమాండోలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి జిల్లాలో ఒక సైబర్ నేరాల పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేస్తాం' అని రాష్ట్ర నూతన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారంలో శాంతిభద్రతల పరిరక్షణ కీలకమని... ఆ బాధ్యతలు క్రియాశీలకంగా నిర్వహిస్తామని చెప్పారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ..తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తన ప్రాధాన్యాలు వివరించారు.

**వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం మోపుతాం..**

* భూ కబ్జాలు సహా అన్ని రకాల వ్యవస్థీకృత నేరాల పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తాం
* సీసీటీఎన్ఎస్‌ను నేరగాళ్ల ముఖాలను గుర్తించే వ్యవస్థ (ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్)తో సమీకృతం చేస్తాం. దీని వల్ల నేరగాళ్ల కదలికలపై నిఘా పెడతాం.
* ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్) 2.0ను తీసుకొచ్చి.. ఫోరెన్సిక్ ల్యాబ్‌లతో సమీకృతం చేస్తాం.
* గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం, ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ (అప్పా) ఏర్పాటు, పోలీసు శాఖకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తాను.
* పోలీసులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తాం.. సకాలంలో పదోన్నతులిస్తాం.
* డయల్ 100, డయల్ 112, టోల్‌ఫ్రీ నంబర్ 1930లకు వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించే సమయాన్ని మరింత తగ్గిస్తాం.
* నేరాల తీరు మారింది. తదనుగుణంగా దర్యాప్తు మెలకువలు నేర్చుకునేలా, శిక్షల శాతం పెరిగేలా పోలీసుల్లో సామర్థ్యాలు పెంచుతాం.
* సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలుంటాయి. రౌడీషీటర్లు, నేరగాళ్లపై నిఘా తీవ్రతరం చేస్తాం.
* విజయవాడలో ట్రాఫిక్ నిర్వహణ అస్త్రం అనే ఏఐ టూల్‌ను వినియోగిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసింగ్‌లో ఏఐ వినియోగాన్ని మరింత విస్తృతం చేస్తాం.
* గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతాం. జట్టుగా పనిచేసి.. ఫలితాలు సాధిస్తాం.

## దిల్లీని ఆప్ 'రాజకీయ ఏటీఎం'గా మార్చుకుంది

(మొదటిపేజీ తరువాయి)

క్యాబినెట్ సమావేశంలోనే దిల్లీలో ప్రతి మహిళ అకౌంట్లోకి రూ.2,500 వచ్చేలా చేస్తాం. ఇది నా గ్యారంటీ' అని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్ అవినీతిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆప్ అందరితో గొడవలు పెట్టుకోవడంలో బిజీగా ఉందని మండిపడ్డారు. దేశాన్ని పాలించే అవకాశాన్ని తమకు ప్రజలు పలుమార్లు కల్పించారని, అలాగే దిల్లీని పరిపాలించే అవకాశాన్ని ఇవ్వాలని ప్రధాని మోదీ ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీపైనా మోదీ విమర్శలు గుప్పించారు. ఆ పార్టీకి చెందిన రాజవంశం దేశానికి యజమానిలా భావిస్తూ అహంకారంతో వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు.

## కుంభమేళా తొక్కిసలాటపై న్యాయ విచారణ కమిటీ ఆరా

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. వీరంతా క్షతగాత్రులు చికిత్స పొందుతున్న స్వరూప్‌రాణి నెహ్రూ ఆసుపత్రిని సందర్శించి బాధితులతో మాట్లాడారు. లఖ్‌నవూకు తిరిగి వెళ్లేముందు జస్టిస్ హర్షకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ''ప్రమాదస్థలాన్ని పరిశీలించి, పరిస్థితులు సమీక్షించాం. ఇప్పుడే ఏమీ చెప్పలేను'' అన్నారు.

## డి.ఎస్.టెక్నాలజీస్ యువతకు ఉపాధిని కల్పించే విధంగా అభివృద్ధి చెందాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : డి.ఎస్.టెక్నాలజీస్ రానున్న రోజుల్లో మరింత మంది యువతకు ఉపాధిని కల్పించే విధంగా అభివృద్ధి చెందాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ లో బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డి.ఎస్.టెక్నాలజీస్ ను ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, అడ్వకేట్ అద్దంకి వెంకటా చారి, దూదిమెట్ల క్రిష్ణ యాదవ్, నాయకులు అనిల్, కాలే నగేష్, గణేష్, నగేష్, కుంటి మల్లేష్, మల్లేష్, ఐటీ శ్రీనివాస్, ప్రసాద్, డిఎస్. టెక్నాలజీస్ అడ్మిన్ ఇంచార్జ్ దూదిమెట్ల నీరజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సమస్యల మీద పోరాడాలి

*** బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : నిరంతరం ప్రజా సమస్యల మీద పోరాడాలని బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్ అన్నారు. ఇటీవల నిజాంపేట్, ప్రగతి నగర్, బాచుపల్లి శాఖలకు అధ్యక్షులుగా నియమితులైన బిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు లు శుక్రవారం బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్ ను మర్యాదపూర్వక కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం నూతనంగా శాఖల అధ్యక్షులుగా నియమితులైన వారిని ఆయన సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరిని కలుపుకోని పోయి పార్టీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

## మాజీ మంత్రి కేటీఆర్ ను కలిసిన 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్



ఫిర్జాదిగూడ , ప్రజాస్ఫూర్తి : బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామరావుని, మేడ్చల్ ఎమ్మెల్యే మాజీమంత్రి చామకుర మల్లారెడ్డి లను శుక్రవారం తెలంగాణ భవన్ లో పీర్జాదిగూడ 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజపేట మండల స్థాయిలో ఫిజికల్ సైన్స్ టెస్ట్ పోటీలు.



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి 21 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. రఘునాథపురం ఉన్నత పాఠశాలకు చెందిన అభిరామ్ ప్రథమ బహుమతి, రాజపేట ఉన్నత పాఠశాలలకు చెందిన బి. శరణ్య ద్వితీయ స్థానం, చల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన ముంతాజ్ తృతీయ బహుమతి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజాపేట కాంప్లెక్స్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సట్టు జయంత, వివిధ పాఠశాలల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు దుడుకు జానయ్య, శ్రీనివాసచారి, పలుగుల రాజు, నవీన్, సత్యానంద్, పారిజాత, మాధవి లత, రాంప్రసాద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను నడిపేటప్పుడు

# సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : వాహనాలను నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మేడ్చల్ రవాణా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్ & ది రాయల్ క్లబ్ ఆఫ్ రైడర్స్ గ్రూప్ సభ్యుల భాగస్వామ్యంతో శుక్రవారం పేట్ బషీరాబాద్ లోని రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రోడ్డు భద్రత సమానాలను పాటించినప్పుడే మనము సురక్షితంగా గమ్యానికి చేరుకోగలమని, తద్వారా మనతోపాటు మన కుటుంబము సంతోషంగా ఉండవచ్చన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాన్ని నడపవద్దని సూచించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అత్యధికులు యువకులేనని క్షణికావేశంతో వాహనాలను వేగంగా నడిపినట్లయితే ప్రమాదాలకు గురై కన్నవారికి బాధను మిగల్చవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి రఘునాథన్ గౌడ్, అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎంవీఐ సాధుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీనుబాబు, శిల్పా, ఉమా, శ్రీకాంత్ రెడ్డి, హైదరాబాద్ సైకిల్



లిస్ట్ గ్రూప్ సైక్లిస్ట్ రవీందర్, బైక్ రైడర్ జై భారతి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ

# సంక్షేమ పథకాల అమలుకు కృషి జరుగుతోంది

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు చొరవతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులుగా ఉన్న ప్రతి కుటుంబానికి చేర్చే విధంగా కృషి జరుగుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో శుక్రవారం చుంచుపల్లి మండలం, పెనగడప గ్రామపంచాయతి 'వనమానగర్'కు చెందిన 30 కుటుంబాలు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా సమక్షంలో సిపిఐలో చేరాయి. వీరికి ఎర్రకండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ప్రతి పేదకుటుంబానికి చేరాలన్నదే కంమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని అందుకోసం ప్రభుత్వంపై పోరాడేందుకు వెనుకాడబోమన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇతర



సంక్షేమపథకాలకోసం దరఖాస్తు చేసుకున్న వారిపేర్లు రాజకీయాలకు తావులేకుండా జాబితాలో చేర్చి పథకాలు అందించాలని, అధికారులు ఈ అంశంపై ప్రేత్యేక ద్రుష్టి సారించాలన్నారు. సింగరేణి స్థలాలపేరుతో పేదల ఇండ్లను ఖాళీచేసి నిర్వాసితులను చేసే చర్యలను సింగరేణి యాజమాన్యం మానుకోవాలని, సంస్థకు అవసరం లేని స్థలాలను ప్రభుత్వానికి అప్పగించి పేదలకు న్యాయం చేయాల కోరారు. సింగరేణి నిర్వాసిత కుటుంబాలకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పరిహారంతోపాటు ప్రత్యామ్నాయ గృహ వసతి కల్పించే బాధ్యత సింగరేణి యాజమాన్యానిదేనన్నారు. పార్టీలో చేరుతున్న నూతన సభ్యులు ప్రజలకు సేవలందించాలని సూచించారు. సిపిఐలో చేరిన ముఖ్యుల్లో దొమ్మేటి శ్రీనివాస్, తోట నవీన్, బోళ్ల సాయికుమార్, గుండ్ల రమేష్, తమ్మిశెట్టి సురేష్, వేముల నాగమణి, తోట స్వరూప తదితరులు తదితరులు వున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, జి వీరాస్వామి, ఎస్ నాగేశ్వర్ రావు, నీడలా సుధాకర్, మన్నెం వెంకన్న, మల్లేష్, తిరుపతి, మన్నెం భాస్కర్, కట్టా శంకర్, ఉదయ్, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాల లో

# విన్నూతనంగా నిజాయితీ షాప్ ప్రారంభం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నారాయణ పాఠశాల లో శుక్రవారం విన్నూతనంగా హానెస్టీ షాప్ (నిజాయితీ షాప్) ను నారాయణ పాఠశాలల ఈ చాంప్స్ ఆర్ అండ్ డి హెడ్ వేములపల్లి స్వాతి లక్ష్మి , ఖమ్మం జోన్ ఏ. జి. ఎం సూరపనేని యోగ రాంకి ప్రారంభించారు. ప్రస్తుత ప్రపంచంలో నిజాయితీకి చోటు ఉందా, ఈ ప్రశ్న అడిగితే ఎక్కువ శాతం మంది నుంచి లేదనే సమాధానమే ఎదురయ్యే అవకాశం ఉందని, ఇలాంటి భావనను తొలగించడానికి, విలువలతో కూడిన విద్యతో పాటు నిజాయితీతో కూడిన విలువల గురించి ఆచరణాత్మకంగా చెప్పేందుకు నారాయణ పాల్వంచ శాఖలో తమ విద్యార్థులకు విన్నూతనంగా హానెస్టీ షాప్ అనే నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టామని నారాయణ పాఠశాలల ఖమ్మ జోన్ ఏ.జి.ఎం సూరపనేని యోగ రాంకి తెలిపారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నారాయణ పాఠశాలల ఈ చాంప్స్ ఆర్ అండ్ డి హెడ్ వేములపల్లి స్వాతి లక్ష్మి మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ ఉన్నతమైంది. ఈ సమయంలో నేర్చుకున్న విషయాలే జీవితాంతం విద్యార్థిని నిలబెడతాయని,. విలువలతో కూడిన విద్యను నేర్చుకుని, విద్యార్థి ఉన్నత స్థాయికి వెళ్లాలని ప్రతి తల్లి దండ్రులు కోరుకుంటారని, అలాంటి మంచి పాఠశాలలను ఎంపిక చేసి అందులో చదివిస్తారని, ప్రస్తుత సమాజంలో విలువలను నేర్పించే శాతం తగ్గిపోయిందని, తమ నారాయణ పాఠశాలలోని విద్యార్థులకు నిజాయితీ, విలువలను





నేర్పించాల్సిన ఆవశ్యకత గుర్తించి హానెస్టీ షాప్ ను విద్యార్థుల్లో నిజాయితీని పెంపొందించే ప్రయత్నంగా ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూరేటి నరసింహరావు మాట్లాడుతూ 'హానెస్టీ షాప్ లో సేల్స్‌మ్యాన్ ఉండరని, విద్యార్థులు తమకు ఇష్టమైన వస్తువులను ఎంపిక చేసుకొని, టేబుల్‌లపై ఉంచిన బాక్స్‌లో వస్తువుకు ప్రదర్శించబడిన ధరల జాబితా ఆధారంగా చెల్లించవచ్చు అని ఇలాంటి అర్థవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించడంలో తల్లితండ్రుల సహకారం, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఖమ్మం నారాయణ పాఠశాలల ఇసిసి వినోద లక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయితీ, నైతికవిలువలు వంటి మంచి లక్షణాలను విద్యార్థులలో వృద్ధి చెందడానికి నిజాయితీ షాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈడ్స్ కోఆర్డినేటర్ నీలిమ, సాఫ్ట్ స్కిల్ ఆర్.ఎస్.టి లక్ పతి, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్లు నరేష్, యెస్వంత్, ఈటెక్నో ఎడి రామకృష్ణ, ఈచాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ, మల్లేష్, సుజిత్, అనూష, దీప్తి, పిఇటి వినయ్, ఎ ఒ దుర్గాప్రసాద్ లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవాసవి మాతకు ప్రత్యేక పూజలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ లో గల శివాలయంలో శ్రీ వాసవి మాత ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కుంభమేళా నుండి త్రివేణి సంగమం నుండి తీసుకువచ్చిన జలాలతో అభిషేకాలు గావించారు. అనంతరం వేద పండితులు నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. తదనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గందె రమేష్, చందా విజయ్ కుమార్, కూర సంతోష్, దొంతుల దినేష్, నార్ల శ్రీనివాస్, మేడిచెట్టి రాజు, పప్పుల శ్రీనివాస్, గంప సుధాకర్, గందె కేశయ్య, ఇరుకుల రాజు, ఉప్పల చంద్రం, ఆర్యవైశ్య మహిళ, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు లో భాగంగా శుక్రవారం రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నుండి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను ఏటా నిర్వహించి వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు విధిగా ధరించాలని, ఇన్సూరెన్స్,డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించడం సెల్ఫోన్ లో మాట్లాడటం నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలకు గురి అవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూడదని ఆయన చెప్పారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని దాని ద్వారా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణ నష్టం జరగకుండా హెల్మెట్ కాపాడుతుందని కలెక్టర్ అన్నారు. ఈ ర్యాలీలో రవాణా , పోలీస్ శాఖ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రకాశం స్టేడియం నుండి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా ముర్రేడు వాగు బ్రిడ్జి వద్ద నుండి తిరిగి రైల్వే స్టేషన్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి వెంకటరమణ, సిక్స్త్ బెటాలియన్ సీఐ బ్రహ్మం,మోటార్ వెహికల్ అధికారులు మనోహర్, భీమ్ సింగ్, వెంకట పుల్లయ్య, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన పేదవారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

*** సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్**



కుత్బుల్లాపూర్, (ప్రజా స్ఫూర్తి ) : అర్హులైన పేద ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి ఒక పథకం అందాలని బాచుపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్ కి సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకి ప్రతి ఒక్కరికి అందాలన్నారు. మున్సిపల్,రెవిన్యూ అధికారులు అందించే విధంగా వారు చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రజా పాలనలో ప్రకటించిన లిస్టులో అనేక అవకతవకలు జరిగాయని ఇళ్ళు ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్ల పథకం లో పేరు వచ్చిందని, ఇళ్ళు లేని పేద ప్రజల పేరు లిస్టులో రాలేదని తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. కనుక వెంటనే అర్హులైన పేద ప్రజలకి సంక్షేమ పథకాలు అందాలని లేని పక్షంలో పేద ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని మున్సిపల్ తహషీల్దార్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కాసాని ఐలయ్య జ్ఞాపకార్థం నిత్యావసర వస్తువులు పంపిణీ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు అమరజీవి కామ్రేడ్ కాసాని మరణించిన సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం రామవరం ప్రశాంతి నగర్ ఎస్ సి బి నగర్ లోని పేదలకు నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు .ఈ సందర్భంగా కాసాని ఐలయ్య చిరకాల మిత్రుడు కొదమసింహం పాండురంగ చార్యులు మాట్లాడుతూ కామ్రేడ్ కాసాని ఐలయ్య మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఐలయ్య మిత్రుడిగా ఆయన జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

## పోలీసుశాఖలో పనిచేసే
# ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ కలిగి ఉండాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హేమచంద్రాపురం జిల్లా పోలీసు హెడ్క్వార్టర్స్ లో 15 రోజుల పాటు సాగిన జిల్లా అర్మడ్ రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో జిల్లాఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా జిల్లా అర్మడ్ సిబ్బంది నుండి ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు.05 ప్లటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పరేడ్ నకు అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు ప్లటూన్ కమాండెర్ గా వ్యవహరించారు. పదిహేను రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇండోర్,ఔట్డోర్,ఫైరింగ్ ప్రాక్టీస్ లలో సిబ్బంది అంతా ఉత్సాహంగా పాల్గొన్నారని ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ ఎస్పీ కి వివరించారు.అనంతరం ఎస్పీ మట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని,భాద్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు.ఈ మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా శారీరక దృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని అన్నారు.అద్బుతంగా చేసిన పరేడ్ ను చూస్తే తమ శిక్షణ రోజులు గుర్తొస్తున్నాయని తెలిపారు.అనంతరం అక్కడ పాల్గొన్న అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

*** ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు మెడల్స్ అందజేత**

**: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

పోలీసు శాఖలో పనిచేస్తూ విశిష్ట సేవలందించిన పోలీస్ అధికారులు సిబ్బందికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాకు చెందిన 260 మందికి శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మెడల్స్ ను అందజేశారు. పోలీసు శాఖలో వారి సేవలకు గాను విభాగాల వారీగా కఠిన సేవా,ఉత్తమ సేవా,సేవా పతకాలతో పాటు యాంత్రిక్ సురక్షా సేవా పతకాలను జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్ పేరెడ్ మైదానం నందు అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణ,నిబద్ధతతో పనిచేసే పోలీసు అధికారులు,సిబ్బందికి



ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని అన్నారు.ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ పతకాలు సాధించిన వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.ప్రజలలో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంచే విధంగా పోలీసు అధికారులు,సిబ్బంది భాద్యతగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,ఎస్బీ సిఐలు నాగరాజు,శ్రీనివాస్ అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,హోంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు,ఎంటిఓ సుధాకర్,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు , ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ టి ఎఫ్ ఫీజు బకాయిల గురించి
# ప్రభుత్వ పెద్దలతో సంప్రదించిన ఫలితం లేదు

*** దరిపల్లి ప్రవీణ్ కుమార్**

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ఆర్ టి ఎఫ్ ఫీజు బకాయిల గురించి ప్రభుత్వ పెద్దలతో సంప్రదిస్తూ, నాయకులను, అధికారులకు పలు రకాలుగా విన్నవించినప్పటికీ.. ఫలితం లేదని మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి 01. 2025 శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఇందిరా పార్క్ నుండి ప్రభుత్వ తీరుకు నిరసనగా మహా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలు బంద్ ప్రకటించి మా నిరసన వ్యక్తం చేసిన తరుణంలో ప్రభుత్వ అధికారుల సూచన మేరకు , ఉపముఖ్యమంత్రి హామీ మేరకు బందును ఉపసంహరించుకున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా యాజమాన్యాలతోటి సమావేశం నిర్వహించి డిసెంబర్ 20 ,



2024 లోపు ఫీజు బకాయిలు అందరికీ చెల్లిస్తానని, ఏ కళాశాలను కూడా వదలకుండా ఇస్తామని చెప్పినప్పటికీ వారు చెప్పిన విధంగా ఎక్కడ జరగలేదన్నారు. మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో యాజమాన్యాలు దిక్కుతోచని పరిస్థితిలో కళాశాలలు నిర్వహించలేక చతికిలబడుతున్నప్పటికీని ప్రభుత్వము కనికరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఫీజు బకాయిలను ఇచ్చి ఇవ్వనట్టుగా కేవలం 25% యాజమాన్యాలకి ఐదు శాతం ఫీజులు చెల్లించి 75 శాతం యాజమాన్యాలకి ఏమి చెల్లించకుండా కాలయాపన చేస్తూ..... అటు విద్యార్థుల భవిష్యత్తును, ఇటు యాజమాన్యాల భవిష్యత్తును అయోమయంలో ఉంచి, తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యా మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 01. 2025 శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఇందిరా పార్క్ నుండి ప్రభుత్వ తీరుకు నిరసనగా మహా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు తెలంగాణ యాజమాన్యం పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించవలసిందిగా కోరారు,. ఈ కార్యక్రమంలో టి పి డి ఎం ఏ ప్రెసిడెంట్ డా"సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి యాద.రామకృష్ణ ,కార్య నిర్వాహక అధ్యక్షులు శ్రీధర్ రావు , పరమేశ్వర్, కోశాధికారి శంకర్ , మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్ కుమార్ , టీమ్ సభ్యులు ప్రజలు విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు ప్రిన్సిపల్ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బి ఆర్ ఎస్ కార్పొరేటర్ల ను అరెస్టు చేయడం దారుణం

*** వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై మాట్లాడినందుకు బి ఆర్ ఎస్ కార్పొరేటర్లందరిని అరెస్టు చేయడం దారుణమని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఎటువంటి చర్చ జరపకుండా బడ్జెట్ ని ఆమోదించడం పై శుక్రవారం తోటి కార్పొరేటర్లతో కలిసి ఆమె జీహెచ్ఎంసీ కమిషనర్కు ఫిర్యాదు అందజేయడానికి వెళ్లగా అక్కడ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయక్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ఏడాది బడ్జెట్లో ఖర్చు చేసిన నిధులపై , ఈ ఏడాది బడ్జెట్లో కేటాయించిన నిధులపై ఎటువంటి చర్చ లేకుండా బడ్జెట్ ని ఆమోదించడం అన్యాయమన్నారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరొకసారి బడ్జెట్ పై చర్చ నిర్వహించాలని కోరారు.



# కుంభమేళా రద్దీ.. ఘాట్‌ల వద్ద గంగా హారతి నిలిపివేత!

* వారణాసి: ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు భారీగా పోటెత్తుతున్నారు. కోట్లాదిగా తరలివస్తుండటంతో నెలకొన్న రద్దీ దృష్ట్యా కొన్ని రోజుల పాటు ఘాట్‌ల వద్ద గంగా హారతి కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 5 వరకు వారణాసిలోని దశాశ్వమేధ్, శీత్ల, అస్సీ మొదలైన ఘాట్‌లలో నిర్వహించే గంగా హారతిని నిలివేస్తున్నామని.. స్థానిక ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. ఘాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన భక్తులు వారణాసికి పెద్ద సంఖ్యలో వస్తుండడంతో కొందరు ప్రయాణికులు వారణాసి, బనారస్ రైల్వే స్టేషన్‌లలో చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఎటువంటి ఘటనలు జరగకుండా భద్రతా బలగాలు నిరంతరం గస్తీ తిరుగుతున్నాయని తెలిపారు. మౌని అమావాస్య నుంచి కాశీలో భక్తుల రద్దీ పెరిగిందని.. వారి సంఖ్య తగ్గేవరకు ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

* మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రద్దీ నియంత్రణకు పలు కీలక నిర్ణయాలు తీసుకొంది. ఈ క్రమంలోనే కుంభమేళా ప్రాంతంలోకి వాహనాల రాకపోకలను నిషేధించారు. వీవీఐపీ, స్పెషల్ పాసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ పొరుగున ఉన్న జిల్లాల నుంచి వచ్చే వాహనాలను సరిహద్దుల వద్దే నిలిపివేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం వన్ వే ట్రాఫిక్ వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇప్పటివరకు 29.64 కోట్లమంది భక్తులు కుంభమేళాకు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు.

# భారత్‌ను మూడో ఆర్థిక వ్యవస్థగా మార్చుతాం



- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి విచారం
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు నివాళి
- ప్రపంచంలో భారత్ ను మూడో ఆర్థిక వ్యవస్థగా మార్చుతాం
- వక్ఫ్ బిల్లు, కృత్రిమ మేధ రంగంలో 'భారత్ ఏఐ మిషన్'
- ఎన్డీఏ సర్కారు పనితీరు గురించి వివరణ

**నేషనల్ బ్యూరో :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కాగా.. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని ఆమె తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు.. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోంది. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనుంది.

**ఏఐ మిషన్ గా భారత్**

భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించాం. కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టాం. భారత్ తన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించే రోజు ఎంతో దూరంలో లేదు.ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాలు, ఇకామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి.సైబర్ సెక్యూరిటీలో సమర్థత కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ వంటివి సామాజిక, ఆర్థిక, దేశ భద్రతకు పెను సవాళ్లుగా మారాయి.

**వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నాం**

మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించాం.ఆయుష్మాన్ భారత్ పథకం కింద.. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది వృద్ధులకు ఆరోగ్య బీమా అందిస్తోంది. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేశాం. సంస్కరణలు వేగవంతం చేశాం. ఒకే దేశంఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం.దేశంలో కార్పొరేట్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్ పతకాలు సాధిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. వారి సాధికారకతకు కృషి చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 91 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత కల్పిస్తున్నాం. 3 కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**పేదరిక నిర్మూలన కు పథకాలు**

ప్రపంచ వేదికపై డిజిటల్ టెక్నాలజీలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. మన యూపీఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రశంసించాయి.పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నాం. 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాం. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటుచేశాం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం వారు ఉపయోగించే పలు ఔషధాలపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశాం. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కోసం యువిన్ పోర్టల్‌ను ప్రారంభించాం.రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్నాం. కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000కోట్లతో 'మిషన్‌మౌసం'ను ప్రారంభించాం. సహకార రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.

## జమ్మూ కశ్మీర్ లో పరిస్థితులు మెరుగయ్యాయి

ఆర్టికల్ 370 తర్వాత జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయి. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయి.సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కు తగ్గింది. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నాం.సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో ఈ ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచింది. మన ముందున్న ఏకైక లక్ష్యం.. 'వికసిత్ భారత్' నిర్మాణమే..!

## తమిళనాడు ప్రభుత్వానికే మాజీ సీఎం జయలలిత ఆస్తులు

- బెంగళూరులో ప్రత్యేక న్యాయస్థానం
- ఫిబ్రవరి 14, 15 తేదీల్లో అప్పగించాలని ఆదేశం



**తెలంగాణ బ్యూరో :** దివంగత సీఎం జె.జయలలిత ఆస్తిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేందుకు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో వాటిని అప్పగించాలని ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తి హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. దివంగత ముఖ్యమంత్రి జె.జయలలిత ఆస్తిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేందుకు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో వాటిని అప్పగించాలని ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తి హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలితకు చెందిన 1,562 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 27 కిలోల బంగారు, వజ్రాభరణాలు, పది వేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తువులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించనుంది. ఈ ఆస్తులు, వస్తువులు తమకు చెందాలంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీప వేసుకున్న అర్జీని ఇటీవలే కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. సుమారు దశాబ్దం క్రితం తమిళనాడు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సమయంలో ఈ ఆస్తుల విలువ రూ. 913 కోట్లు అని పేర్కొంది. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ. 4,000 కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా.

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు




**ఏపీ బ్యూరో : ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘనపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌ను మే 31 వరకు పొడిగించింది. సంజయ్‌పై వచ్చిన అభియోగాల విచారణపై ఏర్పాటైన కమిటీ సిఫార్సులతో ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనపై వచ్చిన అభియోగాల మేరకు 2024 డిసెంబరు 3న సస్పెండ్ చేస్తూ ఆదేశాలు వెలువరించింది. ప్రస్తుతం ఆ సస్పెన్షన్‌ను మే 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.**



## తిరుమలలో సిఫార్సు లేఖలు రద్దు

- రథసప్తమి సందర్భంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటన

**ఏపీ బ్యూరో : తిరుమలలో రథసప్తమి సందర్భంగా ఫిబ్రవరి 4న సిఫారసు లేఖల దర్శనాలు, సర్వదర్శనం టోకెన్లు పూర్తిగా రద్దు చేసినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. శుక్రవారం టీటీడీ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రథసప్తమి రోజున శ్రీవారి దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సిఫారసు లేఖల దర్శనాల రద్దుతో పాటు, తిరుపతిలో జారీ చేసే సర్వదర్శనం టోకెన్లు కూడా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. నేరుగా వచ్చే భక్తులకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా అనుమతిస్తామని వెల్లడించారు. పలు ఆర్జిత సేవలను ఏకాంతంగా నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. మాఢ వీధుల్లో భక్తులకు ఎండ, చలి నుంచి రక్షణకు ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని బీఆర్ నాయుడు తెలిపారు. రథసప్తమికి భారీగా తరలి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని 8 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచాలని నిర్ణయిచామని పేర్కొన్నారు.**

## ఏపీకి ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని ప్రశ్నించాలి

- లేకపోతే ఎన్డీఏకు చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకోవాలి
- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ
- స్పెషల్ స్టేటస్ పై నిలదీయాలి



**ఏపీ బ్యూరో :** కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న చంద్రబాబు ఏపీకి ప్రత్యేక హోదా గురించి ప్రశ్నించాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. హోదా ఇవ్వకపోతే తక్షణమే కేంద్రానికి మద్దతును ఉపసంహరించుకోవాలన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే కేంద్రాన్ని ప్రత్యేక హోదాపై నిలదీయాలని చంద్రబాబుకు రాసిన సుదీర్ఘ లేఖలో పేర్కొన్నారు.మీ మద్దతుతో అధికారం అనుభవిస్తున్న నరేంద్ర మోదీ రాష్ట్ర విభజన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కూటమి పార్టీ ఎంపీలు తమ గళాన్ని విప్పాలని సూచించారు. 10 ఏళ్లు హోదా ఇస్తామని ప్రధాని హామీని ప్రశ్నించాలన్నారు. కూటమి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోలేకపోతే రాష్ట్ర ప్రజల ముందు మరోసారి మిమ్మల్ని ద్రోహిగా నిలబెడతామని హెచ్చరించారు.2014లో బీజేపీ ప్రత్యేక హోదా ఇస్తుందని ఎన్డీయేలో భాగస్వామ్యమై కేంద్ర క్యాబినెట్ లో పదవులు అనుభవించారని, ప్రస్తుత కేంద్ర మంత్రి వర్గంలోనూ ప్రాతినిధ్యం అనుభవిస్తున్న దృష్ట్యా హోదాపై స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అప్పుల్ల ఉందని, కొత్తగా అప్పులు పుట్టడం లేదని, రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే సంపద సృష్టి జరగాలని చెప్పే మీరు హోదాతోనే సంపద సృష్టి జరుగుతుందని తెలుసుకోకపోవడం మీ అవివేకానికి నిదర్శనమని విమర్శించారు.

## పెనుగొండలో సీఎం చంద్రబాబు పర్యటన

**ఏపీ బ్యూరో :** పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో సీఎం చంద్రబాబు పర్యటించారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద సీఎంకు మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకున్న సీఎంకు ఆలయ ప్రధానార్చకులు, అధికారులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత అమ్మవారికి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఏ ఎన్నిక వచ్చినా గెలవాలి

- అప్పుడు సుస్థిర పాలన అందించొచ్చు
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- ఎమ్మెల్సీఎన్నికలపై ఎన్డీయే కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలతో మీటింగ్



**ఏపీ బ్యూరో :** అన్ని ఎన్నికల్లో గెలిచినప్పుడే సుస్థిర పాలన ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పై ఎన్డీయే కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి ఎన్డీయే పక్షాలు సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేసుకుని పని చేయాలన్నారు. 'తొలిసారి గెలిచినా, కొత్తగా వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలి. రాత్రికి రాత్రే అన్నీ జరిగిపోతాయని మనం చెప్పట్లేదు. గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత 16,347 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నాం. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'' అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణాగుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలు, శ్రీకాకుళంవిజయనగరంవిశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ ఉంటుంది. మార్చి 3న ఫలితాలను వెల్లడించనున్నారు.

## రాష్ట్రపతి ప్రసంగం చివరకు అలసిపోయారు

- మీడియాతో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ
- అభ్యంతరకర వ్యాఖ్యలు అంటూ బీజేపీ కౌంటర్



**తెలంగాణ బ్యూరో :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంపై మీడియాతో కాంగ్రెస్ అగ్ర నేత మీడియాతో మాట్లాడారు. 'ప్రసంగం చివరకు వచ్చేసరికి రాష్ట్రపతి బాగా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు వ్యాఖ్యానించారు. సోనియా వ్యాఖ్యలను బీజేపీ తప్పుపట్టింది. ''ఇవి అభ్యంతరకర వ్యాఖ్యలు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వంటి నేతలు ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. మరీ ముఖ్యంగా రాష్ట్రపతిని ఉద్దేశించి చేయకూడదు. ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపదీ ముర్ము.. రాష్ట్రపతిగా ఉన్నారు. కాంగ్రెస్ జమిందారీ మైండ్‌సెట్ ఆ విషయాన్ని అంగీకరించలేకపోతోంది. అందుకే ఆమె ప్రసంగాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు' అని బీజేపీ ఎంపీ సుకంతా మజుందార్ విమర్శించారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంకేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోన్న విధానాలు, సాధించిన విజయాలపై రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోందని, త్వరలో ప్రపంచలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని తెలిపారు. ప్రసంగం ఆరంభంలో ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి విచారం వ్యక్తం చేశారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

## నేటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రిజిస్ట్రేషన్ ఆఫీసుల వద్ద భారీగా రద్దీ

**ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూముల విలువతో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా పెంచేందుకు సిద్ధమైంది.. సవరించిన ధరలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అంటే రేపటి నుంచే అమల్లోకి రాబోతున్నాయి.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ల విలువల సవరణ చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం.. మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ ఛార్జీలను సవరించింది సర్కార్.. అయితే, రేపటి నుంచే కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్న నేపథ్యంలో.. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రద్దీగా మారాయి.. విజయనగరం జిల్లా బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచే కొనుగోలుదారులు క్యూ కట్టారు.. ఈరోజు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఖర్చు తగ్గుతాయని కార్యాలయానికి పెద్ద సంఖ్యలు చేరుకున్నారు.. అయితే, రిజిస్ట్రేషన్ల తాకిడి రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా పెరగడంతో.. ఇంటర్‌నెట్ సేవల్లో అంతరాయం ఏర్పడుతోంది.. రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి శనివారం నుంచి కొత్త మార్కెట్ విలువలు అమల్లోకి రాబోతున్నాయి. ఆయా ప్రాంతాల అభివృద్ధి ప్రతిపాదికన 10 శాతం నుంచి 20 శాతం వరకు ధరలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.. కొత్త మార్కెట్ విలువల అమలుకు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది. భూములతో పాటు నిర్మాణాల విలువల పెంపు కూడా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీ నెలకొంది..



## సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు

- ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా
- టెక్నాలజీ సాయంతో నేరాలను అరికడతాం

**తెలంగాణ బ్యూరో :** సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ కొత్త డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. నూతన టెక్నాలజీ సహాయంతో రాష్ట్రాంలో నేరాలను అరికడతామని వెల్లడించారు. శుక్రవారం విజయవాడలో ఏర్పాటు చేసిన డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీ పోలీసు శాఖలో ద్వారకా తిరుమలరావు చెరగని ముద్ర వేశారని, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అనేక చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల నియంత్రణకు ఈగల్ టీమ్ ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర కార్యక్రమాలను వివరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ టెక్నాలజీతో పోలీసుల సేవలను కొనసాగిస్తామని కొత్త డీజీపీ అన్నారు. నూతన డీజీపీగా నా శక్తిమేర పనిచేస్తానని పేర్కొన్నారు. పదవీ విరమణ చేస్తున్న ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ సర్వీసులో చేరినప్పటి నుంచి అనేక సవాళ్లు చూశానని అన్నారు. సంప్రదాయ పోలీసింగ్ నుంచి సాంకేతిక పోలీసింగ్ వైపు మారామని వివరించారు. గడిచిన కొన్ని రోజులుగా సైబర్ క్రైమ్, గంజాయి, చిన్నారులపై నేరాల నియంత్రణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. విపత్తుల సమయంలో ఏపీ పోలీసులు సాహసోపేతంగా పని చేశారని వివరించారు.

# వాకింగ్ చేసే సమయంలో ఈ తప్పులు చేస్తున్నారా..!

నడక మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందులో ఎటువంటి సందేహం అక్కర్లేదు. చాలా మంది నడకతో ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే గంటల తరబడి నడవాలని అనుకుంటారు. కానీ అక్కర్లేదు. ప్రతి రోజూ కొన్ని నిమిషాల పాటు సరైన క్రమంలో నడిస్తే జిమ్ వర్కౌట్స్ చేసినన్ని ప్రయోజనాలు పొందొచ్చని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. రోజువారీ నడక అనేక ప్రయోజనాలు చేకూరుస్తుందని అనేక అధ్యయనాలు ఘంటాపథంగా చెప్తున్నాయి. కానీ నడకను సరైన క్రమంలోనే చేసేనే ప్రయోజనాలు పూర్తిగా పొందొచ్చంటున్నారు. చాలా మంది నడుస్తున్నామని, కానీ ప్రయోజనాలు కాదు కదా కొత్త సమస్యలు వచ్చాని చెప్తుంటారు. కానీ అందుకు వారు నడిచే సమయంలో చేసే తప్పులే కారణమని అంటున్నారు నిపుణులు. చాలా మంది నడవడం అంటే ఎలాబడితే అలా చేస్తారని, కానీ నడకను కూడా ఒక క్రమపద్ధతిలో చేస్తేనే ప్రయోజనాలు చేకూరుతాయని వివరిస్తున్నారు. బరువు తగ్గడానికి, గుండె ఆరోగ్యానికి కూడా నడక మంచిది. మరి ఇంత మేలు చేసే

**నడకు సరైన క్రమంలో ఎలా చేయాలో ఒకసారి చూద్దామా..**

**నడకలో మార్పులు:**

చాలా మంది తమ స్టార్టింగ్ పాయింట్ నుంచి ఎండింగ్ పాయింట్ వరకు కూడా ఒకే వేగంతో నడుస్తారు. ఇది కూడా చాలా సాధారణంగా చేసే తప్పు అని నిపుణులు చెప్తున్నారు. మీకు సరైన వేగాన్ని కనుగొనడం ముఖ్యం అయినప్పటికీ, మీ వేగాన్ని మార్చడం మీ శరీరాన్ని సవాలు చేస్తుంది. మీ ఫిట్‌నెస్ స్థాయిని మరింత సమర్థవంతంగా మెరుగుపరచడంలో మీకు సహాయపడుతుంది. బ్రిస్క్ వాకింగ్ మీ హృదయ స్పందన రేటును పెంచుతుంది. కేలరీలను బర్న్ చేస్తుంది. వివిధ కండరాలను బలోపేతం చేస్తుంది. ఇందుకోసం చురుకైన నడక, కాసేపు మెల్లగా నడవడం చేయాలి.

నిటారుగా నడవాలి: నడవడం అంటే కొంతమంది వింత వింత పోస్టర్‌లు పెడుతుంటారు. కొందరు ముందుకు వంగిపోయి నడిస్తే మరికొందరు.. ఒక పక్కకు వాలినట్లు శరీరాన్ని ఉంచి నడుస్తుంటారు. ఇది వాళ్లు కావాలని చేసేది కాదు.. వాళ్లు తరచుగా జీవనశైలిలో భాగంగా వచ్చే అలవాటు. కానీ అలాచేయడం వల్ల నడకతో వచ్చే ప్రయోజనాలు గణనీయంగా తగ్గిపోతాయి. వాకింగ్ చేసేటప్పుడు చేసే అత్యంత సాధారణ తప్పులలో ఒకటి భంగిమను నిర్లక్ష్యం చేయడం. వంగిన భుజాలు, వంపు తిరిగిన లేదా తప్పుగా పెట్టిన పాదాలు.. మీ వ్యాయామం ప్రభావాన్ని తగ్గిస్తాయి. కాలక్రమేణా అసౌకర్యం, గాయాన్ని కూడా కలిగిస్తాయి. మీ భుజాలను వెనుకకు ఉంచండి, మీ కండరాలను ప్రభావితం కాకుండా చూసుకోవాలి. మీ చూపులను ముందుకు ఉంచండి. ప్రతి అడుగుతో నేలపై మడమ నుండి కాలి వరకు ఉంచండి. ఇది గాయాలను నివారించడంలో సహాయపడటమే కాకుండా, ఇది మరింత కండరాలను బలంగా చేస్తుంది. మెరుగైన మొత్తం వ్యాయామాన్ని అందిస్తుంది.

**వార్మప్ తప్పక చేయాలి:**

చాలా మంది నడవడమే వార్మప్ అనుకుంటారు. కానీ మీ నడకకు ముందు శరీరాన్ని వేడెక్కనివ్వాలి. లేదంటే కొన్నిసార్లు కండరాలు పట్టేసే అవకాశం ఉంటుంది. అలా జరగకూడదంటే నడక ప్రారంభించే ముందు చిన్న చిన్న వార్మప్‌లు చేయాలి. ఇలా చేస్తే మీ కండరాలు, గుండె, కీళ్లు వ్యాయామం కోసం సిద్ధం అవుతాయి. మీ కండరాలను సడలించడానికి, క్రమంగా మీ హార్ట్ రేట్‌ను పెంచడానికి కొన్ని నిమిషాల డైనమిక్ స్ట్రెచ్‌లు లేదా తేలికపాటి కార్డియోతో మీ నడకను ప్రారంభించండి. అదేవిధంగా మీ నడక పూర్తయిన తర్వాత కూల్ డౌన్, స్ట్రెచింగ్‌తో ముగించాలి. ఇది కండరాల నొప్పిని తగ్గించడంలో, రికవరీని ప్రోత్సహించడంలో హాయపడుతుంది.

**వాకింగ్ షూస్:**

మీ పాదరక్షల ఎంపిక మీ నడక అనుభవాన్ని, మొత్తం సౌకర్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. సరికాని బూట్లు ధరించడం వలన పాదాల నొప్పి, బొబ్బలు వంటి తీవ్రమైన గాయాలకు దారితీయవచ్చు. మీ నడక సమయంలో మీ పాదాలు, కీళ్లను రక్షించడానికి స్థిరత్వాన్ని అందించే వాకింగ్ షూస్ ధరించండి. మీ బూట్లు సరిగ్గా సరిపోతాయని నిర్ధారించుకోండి. వీటితో పాటు సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెప్తున్నారు. వ్యాయామాలకు తగ్గట్టుగా పోషకాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. సరైన పనితీరు, శక్తి స్థాయిలు, రికవరీ కోసం ఈ ఆహారం సహాయపడుతుంది. అందుకోసం ప్రొటీన్, కార్బోహైడ్రేట్‌లను అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. సుదీర్ఘ నడక సమయంలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. అందుకోసం సరిపడా నీరు తాగుతూ ఉండాలని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇంకెందుకు ఆలస్యం ఈ చిట్కాలతో మీ నడక ప్రయాణాన్ని ప్రారంభించేయండి.



# తెలంగాణ స్పెషల్ సర్వపిండి.. 10 నిమిషాల్లో ఇలా చేసుకోవచ్చు..

సర్వపిండి అంటే ఇష్టపడని తెలంగాణ బిడ్డ ఉండడు. అంతగా ఈ వంటకం తెలంగాణ ప్రజల మనసుల్లో నాటుకుపోయింది. ఏ వయస్సు వారైనా సరే వీటిని తినేందుకు ఇష్టపడతారు. ఒక్కసారి ఒక్కముక్క నోట్లో పెట్టుకుంటే నాలుక మళ్లీ మళ్లీ కావాలని అడుగుతుంటది. అంత రుచికరంగా ఉంటుంది. చలికాలంలో చేసుకొని వేడి వేడిగా తింటే ఇంకా అద్భుతంగా ఉంటుంది. కామన్ మ్యాన్ పిజ్జాగా పిలువబడే సర్వపిండిని ఇంట్లో తయారు చేసుకోవడం చాలా చాలా ఈజీ. తెలంగాణ ప్రసిద్ధ వంటకం సర్వపిండి తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

**సర్వపిండి తయారీకి కావాల్సిన పదార్థాలు**

బియ్యం పిండి
నువ్వులు
వేయించిన వేరుశెనగ పప్పు
నానబెట్టిన శెనగపప్పు
సన్నగా తరిగిన ఉల్లిపాయ
తరిగిన పచ్చిమిర్చి
కరివేపాకు
కారం
ఉప్పు
నూనె
కొత్తిమీర
జీలకర్ర
అల్లంవెల్లుల్లి పేస్ట్
ఆయిల్



**సర్వ పిండి తయారీ విధానం**

ముందుగా ఒక బౌల్ తీసుకొని అందులో రెండు కప్పుల బియ్యం పిండి వేసి అందులోనే సన్నగా కట్ చేసిన 2 పచ్చిమిర్చి,చిన్న ముక్కలుగా కట్ చేసిన 1 మీడియం సైజ్ ఉల్లిపాయ,సన్నగా తరిగిన కొంచెం కొత్తిమీర, సన్నగా కట్ చేసిన రెండు రెమ్మల కరివేపాకు,1 టేబుల్ స్పూన్ నువ్వులు, అర టీ స్పూన్ జీలకర్ర,వేయించిన పొట్టు తీసుకున్న ఒకటిన్నర టేబుల్ స్పూన్ పల్లీలు, నానబెట్టిన 2 టేబుల్ స్పూన్ల పచ్చి శెనగపప్పు,సరిపడా కారం,రుచికి సరిపడా ఉప్పు,అర టీ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పిండిలో అన్నీ కలిసేలా బాగా కలుపుకోండి.

కొద్ది కొద్దిగా నీళ్లు పోసుకుంటూ పిండిని కొంచెం లూజ్ గా ఉండేలా కలిపి ఈ బౌల్ ని పక్కనపెట్టుకోండి. ఉప్పు,కారం చెక్ చేసుకోని సరిపోకపోతే కొంచెం వేసుకోండి

ఇప్పుడు అడుగు మందంగా ఉండే గుంటలాంటి బాండీ తీసుకొని అందులో రెండు టేబుల్ స్పూన్ల ఆయిల్ పోసి బాండీ అంతా ఆయిల్ అంటుకునేలా చేతితో స్ప్రెడ్ చేయండి.

ఇప్పుడు బౌల్ లో కలిపిపెట్టుకున్న పిండిని కొంచెం ముద్దగా తీసుకొని దాన్ని ఆయిల్ పూసిన బాండీలో వేసి మరీ పల్చగా కాకుండా,మరీ మందంగా కాకుండా మీడియంగా బాగా వత్తుకొని మధ్య మధ్యలో రంధ్రాలు మాదిరి చేయండి.

ఇప్పుడు ఆ హోల్స్ లో కొంచెం ఆయిల్ పోసి బాండీని స్టవ్ మీద పెట్టుకోండి.

బాండీపై మూత పెట్టేసి మంటను సిమ్ లో పెట్టి వేయించుకోవాలి. 10 నిమిషాల తర్వాత మూత తీసి చూడండి. సర్వపిండి బాండీ నుంచి విడిపోయినట్లు అయితే దాన్ని గరిటతో మరో వైపుకి తిప్పు లైట్ గా వేపుకోండి. టేస్టీ సర్వపిండి రెడీ.



# మొదటిసారి విమాన ప్రయాణమా..

విదేశీ ప్రయాణాలు ఈ మధ్య అధికం అవుతున్నాయి. యువత అంతా కూడా విదేశాలకు వెళ్లి అక్కడ జాబ్‌లు చేయాలని, ఉన్నత చదువులని చెప్తూ విదేశాలకు వెళ్తున్నారు. ఇలా విదేశాలకు వెళ్లి సెటిల్ అవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయని అధికారిక లెక్కలే చెప్తున్నాయి. ఈ క్రమంలో చాలా మంది తొలిసారి విమానం ఎక్కుతున్న వారే. అయితే వీరు తొలిసారి ప్రయాణం చేసే వాళ్లు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. అవి తెలియకుండా బ్యాకులు ప్యాక్ చేసుకుని వెళ్తే ఇబ్బందులు తప్పవు. ప్రయాణానికి ముందు ఎయిర్ పోర్ట్ లో ఏం చేయాలో, ప్రయాణ సమయంలో ఎలా ఉండాలో ముందుగానే కొన్ని ముఖ్య విషయాలు తెల్సుకుంటే మేలు. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాక గాబరా పడకుండా ఉంటారు. కొన్ని చిన్న చిన్న విషయాలు తెల్సుకుంటే చాలు. మరి అవేంటో ఒకసారి చూద్దామా..

**ప్రయాణానికి ముందు..**

1. టికెట్ బుక్ చేసుకునే ముందే పాస్‌పోర్ట్ అప్‌డేట్‌లో ఉందా లేదా అని చూసుకోవాలి. అలాగే మీ ఫ్లైట్ సరైన సమయానికే ఉందా? లేదా ఏమైనా ఆలస్యం అవుతోందా? లేదంటే విమానం ఏమైనా రద్దయ్యిందా అని మీకు అప్‌డేట్స్ వస్తుంటాయి. వాటిని చెక్ చేసుకుంటూ ఉండాలి. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లేముందు విమానం స్టేటస్ తప్పకుండా చూసుకోవాల్సిందే. విమాన సమయాలపై, పాస్‌పోర్ట్ అప్‌డేట్స్ అన్నీ పూర్తిగా చెక్ చేసుకున్న తర్వాత ప్రయాణం ప్రారంభించాలి.
2. విమానంలో మనం ఎంత లగేజీ తీసుకెళ్లాలనే విషయంలో కూడా పరిమితులు ఉంటాయి. మీరు ప్రయాణిస్తున్న ఎయిర్‌లైన్ కంపెనీ ఒక్కొక్కరికీ ఎన్ని బ్యాగులు, ఎంత బరువు పరిమితిని ఇస్తుందో ముందే చూసుకోండి. వాటికి అనుగుణంగా ప్యాకింగ్ చేసుకోండి. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లేముందు ఇంట్లోనే మీ లగేజీ బరువు ఎయిర్‌లైన్స్ నిబంధనల పరిమితిలో ఉందో లేదో చూసుకోవాలి. అలా చేయడం ద్వారా విమానాశ్రయానికి వెళ్లిన తర్వాత ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదు. లేదంటే ఎక్కువ లగేజీ తీసుకెళ్లడం కోసం డబ్బులు కట్టాల్సి వస్తుంది.
3. మీతో పాటూ విమానంలో తీసుకెళ్లడానికి ఒక చెక్‌ఇన్ బ్యాగ్ అనుమతి ఉంటుంది. అందులో మీకు సంబంధించిన ముఖ్యమైన వస్తువులు, పాస్‌పోర్ట్, టికెట్, బోర్డింగ్ పాస్, ఫోన్, ల్యాప్‌టాప్, వ్యాలెట్, చార్జర్, ఏవైనా మందులు, మీ గుర్తింపు కార్డుల్లాంటివి ఉంచుకోండి. అవసరానికి అందుబాటులో ఉంటాయి.
4. చెక్ ఇన్ బ్యాగులో, ఇతర లగేజీలలో కొన్ని విమాన సంస్థలు కొన్ని రకాల వస్తువుల్ని అనుమతించవు. మంటను ప్రేరేపించే వస్తువులు, కొన్ని రకాల మందులు, పదునైన వస్తువులు, బ్యాటరీలు.. ఇలాంటివి కొన్ని మన లగేజీలో ఉండటం నిషిద్ధం. అవి ముందుగానే తెలుసుకోండి.

**ప్రయాణం చేసేటప్పుడు..**

1. మీ సీట్ వెనక్కి రిక్లైన్ చేసుకోవాలనుకుంటే ముందుగా వెనక ప్యాసెంజర్‌ను ఒకసారి గమనించుకోవాలి.
2. పిల్లలతో ప్రయాణిస్తుంటే వాళ్లు అల్లరి చేయకుండా చూసుకోవాలి. అందుకోసం ఏవైనా ఆటవస్తువులు దగ్గర ఉంచుకోండి. వేరేవాళ్లకు ఇబ్బంది కాకుండా చూసుకోండి.
3. దూర ప్రయాణం అయితే మీతో తప్పకుండా నెక్ పిల్లో, ఐ మాస్క్ లాంటివి ఉంచుకోండి. హాయిగా నిద్రపోవచ్చు.
4. మన భద్రతకు సంబంధించిన విషయాలు విమాన సిబ్బంది చెప్తారు. మీ సీట్ బెల్ట్ ఎలా పెట్టుకోవాలి, ప్రాణాపాయ స్థితి వస్తే లైఫ్ జాకెట్ ఎలా వాడాలి, ఆక్సిజన్ మాస్క్ ఎలా తీసుకోవాలి, ఎమర్జెన్సీ డోర్లు ఎక్కడున్నాయి, వాటిని ఎలా వాడాలి.. లాంటి విషయాలన్నీ చెబుతారు. వాటిని వినడంలో అశ్రద్ధ వహించొద్దు.





# ఎండుద్రాక్షతో మెరిసే చర్మం



మెరిసే చర్మం ప్రతి ఒక్కరి కల. ఎటువంటి మచ్చలేని మెరిసే చర్మం కోసం రకరకాల క్రీములు వాడుతుంటారు. కొత్త కొత్త బ్యూటీ ప్రొడక్ట్స్, బ్యూటీ ట్రీట్‌మెంట్లను ఆశ్రయిస్తూ.. తమ చర్మంపై ప్రయోగాలు చేస్తుంటాయి. వీటి ద్వారా అందమైన చర్మం పొందొచ్చని భావిస్తున్నారు. అయితే చాలా సందర్భాల్లో ఇవి వికటించి లేనిపోని సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. వీటి నుంచి బయటపడటానికి మళ్ళీ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అయితే చర్మ సౌందర్యం కోసం రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్ వాడాల్సిన అవసరం లేదని నిపుణులు చెప్తున్నారు. ఎండు ద్రాక్షతో మెరిసే చర్మం పొందొచ్చని అంటున్నారు. సహజమైన పద్ధతిలో మెరిసే చర్మాన్ని పొందాలని భావిస్తే ఇవి ది బెస్ట్ చాయిస్ అని చెప్తున్నారు. ఎండుద్రాక్షలో ఫినాలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి వంటి యాంటీఆక్సిడెంట్లు ఎండుద్రాక్షలో కనిపిస్తాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్‌స్‌ను స్థిరంగా ఉంచుతాయి. ఇది మీ చర్మం ఆరోగ్యంగా, మెరుస్తూ ఉంటుంది. మరి మెరిసే చర్మం కోసం ఎండు



**ద్రాక్షను ఎలా వాడాలంటే..**

**ఫేస్ టోనర్:**

చర్మ సంరక్షణలో టోనర్‌ను ప్రాథమికంగా పరిగణిస్తారు. అందుకోసం ఎండుద్రాక్ష సహాయంతో ఫేస్ టోనర్ చేయండి. ఇందు కోసం ఒక పిడికెడు ఎండుద్రాక్షను తీసుకుని, అవి మెత్తబడే వరకు నీటిలో ఉడకబెట్టాలి. ఆ నీటిని చల్లారే వరకు ఉంచి. ఆ తర్వాత దానిని ఫిల్టర్ చేసి స్ప్రే బాటిల్‌లో నిల్వ చేసుకోవాలి. దాంతో మొఖాన్ని శుభ్రం చేసిన తర్వాత, ఎండుద్రాక్షతో చేసిన ఈ టోనర్‌ని మీ ముఖంపై స్ప్రే చేయండి. ఇది చర్మ రంధ్రాలను ముసుకుపోయేలా చేస్తుంది. మీ చర్మాన్ని మెరిసేలా చేయడంలో సహాయపడుతుంది.

**ఆహారంలో చేర్చుకోండి:**

ఎండుద్రాక్షతో మెరిసే చర్మాన్ని పొందడానికి సులభమైన మార్గం వీటిని మీ ఆహారంలో చేర్చుకోవడం. ఎండుద్రాక్ష తినడం ద్వారా అవి అందించే అన్ని ప్రయోజనాలను అందిస్తున్నాయి. చర్మం, ఆరోగ్యం రెండింటికీ ప్రయోజనం చేకూరుతుంది. మీరు దీన్ని అలాగే తినవచ్చు లేదా మీ అల్పాహారంలో చేర్చుకోవచ్చు.

**ఎండుద్రాక్ష ఫేస్ మాస్క్:**

ఎండుద్రాక్షను ఆహారంలో చేర్చడమే కాకుండా చర్మ సౌందర్యం కోసం అనేక రకాలుగా కూడా వినియోగించొచ్చు. ఉదాహరణకు మీరు వారానికి ఒకసారి మీ చర్మంపై ఎండుద్రాక్షతో చేసిన ఫేస్ మాస్క్‌ను అప్లై చేయవచ్చు. దీని కోసం ఒక గుప్పెడు ఎండుద్రాక్షను రాత్రంతా నీటిలో నానబెట్టి, తరువాత వాటిని మెత్తగా, మరుసటి రోజు ఉదయం పేస్ట్ చేయండి. ఇప్పుడు మొదట మీ ముఖాన్ని శుభ్రం చేసి ఆపై ఈ పేస్ట్‌ను మీ ముఖం, మెడపై అప్లై చేయండి. మీరు దీన్ని సుమారు 1520 నిమిషాలు వదిలేయండి. చివరగా మీ ముఖాన్ని గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా తరచూ చేయడం ద్వారా మెరిసే చర్మాన్ని పొందొచ్చు.

**ఎండుద్రాక్ష స్క్రబ్:**

మెరిసే చర్మాన్ని పొందడానికి దానిని ఎక్స్‌ఫోలియేట్ చేయడం చాలా ముఖ్యం. ఇది డెడ్ స్కిన్ సెల్‌స్‌ను తొలగించడమే కాకుండా టోన్, గ్లోయింగ్ స్కిన్ మీకు అందిస్తుంది. మీకు కావాలంటే మీరు ఎండుద్రాక్ష సహాయంతో ఇంట్లో స్క్రబ్ కూడా సిద్ధం చేసుకోవచ్చు. ఇందుకోసం ముందుగా ఎండు ద్రాక్షను నానబెట్టి కాసేపు అలాగే ఉంచాలి. ఇప్పుడు అందులో ఒక చెంచా తేనె, ఒక చెంచా ఓట్ మీల్ కలపాలి. కడిగే ముందు కొన్ని నిమిషాల పాటు ఈ స్క్రబ్‌తో మీ ముఖాన్ని వృత్తాకార కదలికలో మసాజ్ చేయండి. తేలికపాటి మసాజ్ చేసిన తర్వాత సుమారు పది నిమిషాల పాటు ఇలాగే ఉంచండి. చివరగా, నీటి సహాయంతో చర్మాన్ని శుభ్రం చేయండి. ఈ చిట్కాలు పాటించడం ద్వారా మెరిసే చర్మాన్ని పొందొచ్చు.

### ఎల్ అండ్ టీ, ఐటీ స్టాక్స్ దన్నుతో

## సెన్సెక్స్ 740 పాయింట్లు లబ్ధి..

**23,500 ఎగువన నిఫ్టీ..!**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాలతో ముగిశాయి. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరా (2025-26)నికి ప్రవేశ పెట్టనున్న వార్షిక బడ్జెట్ సానుకూలంగా ఉంటుందన్న అంచనాల మధ్య శుక్రవారం ఎల్ అండ్ టీ, ఐటీ స్టాక్స్ మద్దతుతో పుంజుకున్నాయి.

వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు 6.3-6.8 శాతం మధ్య ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం సమర్పించిన ఆర్థిక సర్వే కూడా దేశీయ స్టాక్ మార్కెట్లకు ఊతమిచ్చింది. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 740.76 పాయింట్లు లబ్ధి పొందితే, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 258.90 పాయింట్లు పుంజుకుని 23,500 పాయింట్ల ఎగువన 23,508.40 పాయింట్ల వద్ద స్థిర పడింది. నెస్లే ఇండియా, ఇండస్ ఇండ్ బ్యాంక్ నాలుగు శాతం చొప్పున లాభ పడ్డాయి.

అంతర్గత ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 790.11 పాయింట్ల లబ్ధితో 77,549.92 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 281.2 పాయింట్ల వృద్ధితో 23,530.70 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరుకుంది. బీఎస్ఈ -30 సెన్సెక్స్‌లో టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతి, ఐటీసీ భారీగా లబ్ధి పొందగా, ఐటీసీ హోటల్స్, బజాజ్ ఫిన్ సర్వ్, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంకు నష్టపోయాయి.

ఆసియా మార్కెట్లలో టోక్యో మార్కెట్ పాజిటివ్‌గా ముగిసింది. సియోల్ నష్టపోగా, షాంఘై, హాంకాంగ్ స్టాక్ మార్కెట్లకు శుక్రవారం సెలవు. అమెరికా మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. గురువారం భారత్ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,582.95 కోట్ల విలువైన వాటాలు కొనుగోలు చేశారు. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.13 శాతం పుంజుకుని 76.97 డాలర్లు పలుకుతోంది.

## 8 ఓలా ఎలక్ట్రిక్ మూడో తరం స్కూటర్ల ఆవిష్కరణ..

**రూ.79,999 నుంచి ప్రారంభం..!**



**ముంబై:** ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ దేశీయ మార్కెట్లోకి శుక్రవారం ఎనిమిది మూడో తరం ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆవిష్కరించింది. అడ్వాన్స్‌డ్ జెన్ 3 ప్లాట్‌ఫామ్‌పై ఎస్1 బ్రాండ్‌పై ఎనిమిది స్కూటర్లను అందుబాటులకి తెచ్చింది. వీటి ధరలు రూ.79,999 (ఎక్స్ షోరూమ్) నుంచి రూ.1,69,999 (ఎక్స్ షోరూమ్) మధ్య పలుకుతాయి. జెన్ 3 ఎస్1 స్కూటర్లతోపాటు జెన్ 2 స్కూటర్ల విక్రయాలు కొనసాగుతాయని ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. శుక్రవారం (జనవరి 31, 2025) నుంచి స్కూటర్ల ప్రీ బుకింగ్స్ ప్రారంభించింది. ఫిబ్రవరి రెండో వారంలో బుక్ చేసుకున్న కస్టమర్లకు స్కూటర్ల డెలివరీ ప్రారంభం అవుతుందని వెల్లడించింది.

మూడోతరం ఎస్1 స్కూటర్లను ఆవిష్కరించిన నేపథ్యంలో ఎస్1 ప్రో, ఎస్1 ఎక్స్ (2కిలోవాట్లు, 3 కిలోవాట్లు, 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్స్) రెండోతరం స్కూటర్లపై రూ.35 వేల వరకూ డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నది. దీంతో ఈ స్కూటర్లు రూ.1,14,999 (ఎక్స్ షోరూమ్), రూ.69,999 (ఎక్స్ షోరూమ్), రూ.79,999 (ఎక్స్ షోరూమ్), రూ.89,999 (ఎక్స్ షోరూమ్) ధరలకు లభిస్తాయి.

5.3 (4680 భారత్ సెల్) కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో వస్తున్నమూడోతరం ఎస్1 ప్రో ం స్కూటర్ రూ.1,69,999 (ఎక్స్ షోరూమ్), 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ ఎస్1 ప్రోం స్కూటర్ ధర రూ.1,54,999 (ఎక్స్ షోరూమ్) లకు లభిస్తుంది. మూడో తరం ఎస్1ప్రో స్కూటర్ (4 కిలోవాట్లు) రూ.1,34,999 (ఎక్స్ షోరూమ్), 3 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో వస్తున్న స్కూటర్ రూ.1,14,999 (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.

ఎస్1 ఎక్స్ (2కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్) స్కూటర్ ధర రూ.79,999 (ఎక్స్ షోరూమ్), 3కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ స్కూటర్ ధర రూ.89,999 ((ఎక్స్ షోరూమ్), 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ వేరియంట్ ధర రూ99,999 (ఎక్స్ షోరూమ్)లకు లభిస్తుంది. అదనంగా ఎస్1ఎక్స్ ం విత్ 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ స్కూటర్ రూ.1,07,999 (ఎక్స్ షోరూమ్) లభిస్తుంది. ఈ ధరలు వచ్చే ఏడు రోజులు మాత్రమే అమల్లో ఉంటాయి. తదుపరి ఓలా ఎలక్ట్రిక్ వీటిని సవరించనున్నది.

మిడ్ డ్రైవ్ మోటార్, చైన్ డ్రైవ్, సుపీరియర్ పెర్ఫార్మెన్స్, రేంజ్, ఎఫిషియెన్సీ కోసం ఇంటిగ్రేటెడ్ ఎంసీయూతో కూడిన టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్స్‌తో రూపుదిద్దుకున్నాయి ఓలా మూడో తరం ఎస్1 స్కూటర్లు. ఫస్ట్ డ్యుయల్ ఏబీఎస్, బ్రేక్ బై వైర్ టెక్నాలజీ, సేఫ్టీ విస్తరణతోపాటు 15శాతం ఎనర్జీ రికవరీ మెరుగుదల కలిగి ఉంటుంది. సృజనాత్మకతతో రూపుదిద్దుకున్న మూడో తరం ఓలా ఎస్1ఎక్స్ స్కూటర్ ఇంజిన్లలో 20 శాతం విద్యుత్ పెరగడంతోపాటు 11 శాతం ఖర్చు తక్కువ. ఓలా ఎలక్ట్రిక్ తన యూజర్ల కోసం మూవ్ ఓఎస్ వచ్చేనెల మధ్యలో ఆవిష్కరిస్తుంది. ఇందులో ఓలా మ్యాప్స్ నిర్వహించే స్మార్ట్ వాచ్ యాప్, స్మార్ట్ పాక్, భారత్ మూడ్, రోడ్ ట్రిప్ మూడ్, లైవ్ లొకేషన్ షేరింగ్, ఎమర్జెన్సీ ఎస్ఓఎస్ తదితర ఆప్షన్లు ఉంటాయి.

## సీనియర్ సిటిజన్లకు ఐఆర్‌డీఏఐ ఊరట

**ఏటా ప్రీమియం పెంపు 10% మించొద్దు**




**న్యూఢిల్లీ:** సీనియర్ సిటిజన్లకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి ఐఆర్‌డీఏఐ పెద్ద ఊరట కల్పించింది. బీమా కంపెనీలు వీరికి ఇచ్చే ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియం పెంపు ఏటా 10 శాతం మించకూడదని స్పష్టం చేసింది. అంతకు మించితే ముందుగా తమ అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియాన్ని బీమా కంపెనీలు ఏటా ఎడాపెడా పెంచుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఐఆర్‌డీఏఐ ఈ చర్య తీసుకుంది. ఈ పాలసీల ప్రీమియం కూడా క్లెయిమ్‌ల ద్వారా చెల్లించే మొత్తం, ఖర్చుల ఆధారంగా ఉండాలని స్పష్టం చేసింది.

# సచిన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు..

**ప్రకటించిన బీసీసీఐ..**



**న్యూఢిల్లీ:** టీమిండియా దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్‌కు బీసీసీఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. శనివారం బీసీసీఐ వార్షిక కార్యక్రమంలో సచిన్‌ను అవార్డుతో సత్కరించనున్నది. సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు సచిన్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. భారత క్రికెట్‌కు దిగ్గజ ఆటగాడు అందించిన సేవలు అమోఘమని పేర్కొన్నాయి. ఈ పురస్కారాన్ని స్వీకరించనున్న 31వ ఆటగాడు సచిన్ టెండూల్కర్ కావడం విశేషం. గతంలో మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి, లెజెండరీ వికెట్ కీపర్ ఫరూక్ ఇంజినీర్ సహా పలువురు ఈ అవార్డును అందుకున్నారు. 1994లో భారత జట్టు తొలి కెప్టెన్ కర్నల్ సీకే నాయుడు గౌరవార్థం ఈ అవార్డును బీసీసీఐ తీసుకువచ్చింది. సీకే నాయుడు 1916 నుంచి 1963 వరకు సుదీర్ఘంగా 47 సంవత్సరాల పాటు ఫస్ట్‌క్లాస్‌లో కొనసాగారు. ఇది ప్రపంచ రికార్డు కావడం విశేషం.

**సచిన్ గణాంకాలు..**

ఇంటర్నేషనల్ క్రికెట్ అత్యధిక పరుగులు చేసిన ఏకైక ఆటగాడు సచిన్. సెంచరీల్లోనూ సెంచరీ కొట్టిన ఏకైక ఆటగాడు. టెస్ట్ క్రికెట్‌తో పాటు, వన్డే ఫార్మాట్‌లోనూ సచిన్ అనేక రికార్డులు నెలకొల్పాడు. అతను వన్డేల్లో 44.83 సగటుతో 18,426 పరుగు లు చేయగా.. ఇందులో 49 సెంచరీలు, 96 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక టెస్ట్‌ల్లో 53.78 సగటుతో 15,921 పరుగులు చేశా డు. ఇందులో 51 సెంచరీలు, 68 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన కెరియర్‌లో కేవలం ఒకే ఒక టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు ఆటగాడు సచిన్ టెండూల్కర్. భారత్ తరఫున మొత్తం 664 మ్యాచ్‌లు ఆడాడు. 48.52 సగటుతో 34,357 పరుగులు చేశాడు. వీటిలో 100 సెంచరీలు, 164 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

**క్రికెట్ ఐకాన్‌గా..**

సచిన్ కేవలం అద్భుతంగా పరుగులు సాధించడమే కాకుండా క్రికెట్‌కు ఐకాన్‌గా మారాడు. 1989లో 16 సంవత్సరాల వయసులో పాకిస్తాన్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. రెండు దశాబ్దాల పాటు భారత జట్టుకు విశేష సేవలు అందించాడు. 2011లో వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సచిన్ సభ్యుడు కాగా.. కప్‌ని గెలువడంలోనూ తన వంతు పాత్ర పోషించాడు. సచిన్ తన బ్యాట్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ బౌలర్లు సైతం వణికించాడు. దివంగత షేన్ వార్న్ నుంచి ముత్తయ్య మురళీధరన్ వరకు అందరూ సచిన్‌ను ప్రశంసించారు. ఏ సమయంలోనైనా మ్యాచ్ గమనాన్ని మార్చగల సత్తా సచిన్లో ఉందని చెప్పారు. అలాగే, పలువురు ప్రముఖ బౌలర్లు సైతం సచిన్‌కు బౌలింగ్ చేయడం కష్టమని పనిగా చెప్పారు. పోటీ జట్లు సచిన్‌ను అవుట్ చేసేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించేవి. అవార్డుకు ఎంపికైన సచిన్ టెండూల్కర్‌కు పలువురు క్రికెటర్లతో పాటు అభిమానులు సైతం సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## హ్యాట్రిక్ సిక్సర్లతో విరుచుకుపడ్డ దినేశ్ కార్తీక్

**ధోనీ రికార్డు బ్రేక్!**

**దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ఆడుతున్న టీమిండియా మాజీ క్రికెటర్**

**పార్ల్ రాయల్స్ తరఫున బరిలోకి కార్తీక్**

**జోబర్గ్ సూపర్ కింగ్స్ పై హాఫ్ సెంచరీ (53)తో రాణించిన డీకే**

**ఈ క్రమంలో విహాన్ లుబ్బే వేసిన ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సులు**

**టీ20ల్లో ధోనీ (7,432 పరుగులు) రికార్డును బద్దలు కొట్టిన కార్తీక్ (7,451 రన్స్)**




**జోహన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ఆడుతున్న టీమిండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ హ్యాట్రిక్ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో పార్ల్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన కార్తీక్.. జోబర్గ్ సూపర్ కింగ్స్ పై హాఫ్ సెంచరీ (53)తో చెలరేగాడు. 39 బంతుల్లో 4 బౌండరీలు, 3 సిక్సర్లతో 53 పరుగులు చేశాడు. ఈ క్రమంలో విహాన్ లుబ్బే వేసిన ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సులు బాదాడు.

కాగా, టీ20ల్లో భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ రికార్డును కార్తీక్ అధిగమించాడు. ఇప్పటివరకు కార్తీక్ టీ20ల్లో 7,451 రన్స్ చేశాడు. ఈ క్రమంలో ఎంఎస్‌డీ (7,432) రికార్డును డీకే బ్రేక్ చేశాడు. 39 ఏళ్ల కార్తీక్ 361 టీ20 ఇన్నింగ్స్‌లలో 26.99 సగటు, 136.84 స్ట్రైక్ రేట్‌తో 7,451 పరుగులు చేశాడు. ఇందులో 34 అర్ధ శతకాలు ఉన్నాయి. అలాగే తన టీ20 కెరీర్‌లో ఇప్పటివరకు 258 సిక్సర్లు, 718 ఫోర్లు కొట్టాడు. అటు ధోనీ 342 టీ20 ఇన్నింగ్స్‌లలో 38.11 సగటుతో 7,432 పరుగులు చేశాడు. ఇందులో 28 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అలాగే 517 ఫోర్లు, 338 సిక్సర్లు బాదాడు.

## విరాట్ విఫలం..



**6 రన్స్‌కే క్లీన్‌బౌల్డ్**

**న్యూఢిల్లీ:** పుష్కరకాలం తర్వాత దేశవాళీలో పునరాగమనం చేసిన టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తీవ్ర నిరాశపరిచాడు. రంజీ మ్యాచ్‌లో రైల్వేస్‌తో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. యశ్ ధూల్ ఔట్ కావడంతో సెకండ్ డౌన్‌లో క్రీజ్‌లోకి వచ్చిన కోహ్లీ కేవలం 6 పరుగులు చేసి పెవిలియన్‌కు వెనుతిరిగాడు. స్వంగ్వాన్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో విరాట్ బ్యాటింగ్ చూడ్డానికి వచ్చిన ఫ్యాన్స్‌ను నిరాశపరిచాడు.

అంతకుముందు విరాట్‌ను చూసేందుకు వచ్చిన ప్రేక్షకులతో స్టేడియం పూర్తిగా నిండిపోయింది. కోహ్లీ బ్యాంటింగ్‌కు వస్తుండగా అభిమానులు నినాదాలతో హెూరెత్తించారు. అయితే తక్కువ రన్స్‌కే ఔటవడంతో నిరాశతో స్టేడియం నుంచి వెనుతిరిగారు. కాగా, ఢిల్లీ వెంటవెంటనే 4 వికెట్లు కోల్పోవడంతో చిక్కులో పడింది. ప్రస్తుతం 30 ఓవర్లు ముగిసే సరికి 101 రన్స్ చేసింది. మరో 140 పరుగులు వెనకపడి ఉంది.

# ఫైనల్‌లో యువ భారత్..

**ఫిబ్రవరి 2న దక్షిణాఫ్రికాతో టీమిండియా ఫైట్..!**



**కౌలాలంపూర్:** కౌలాలంపూర్ వేదికగా జరిగిన అండర్-19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో యువ భారత్ ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను తొమ్మిది వికెట్ల తేడాతో టీమిండియా ఓడించింది. 114 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. మరో ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే.. ఘన విజయం సాధించింది. ఫిబ్రవరి 2న ఆదివారం దక్షిణాఫ్రికాతో టీమిండియా తలపడనున్నది.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఇంగ్లిష్ జట్టును తక్కువ స్కోర్‌కే పరిమితం చేశారు. ఆ తర్వాత బరిలోకి దిగిన టీమిండియా వికెట్ నష్టపోయి 15 ఓవర్లలోనే 117 పరుగులు చేసి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. లక్ష్య చేధనలో కమలిని-త్రిష జోడీ టీమిండియాకు మంచి శుభారంభం అందించింది. ఇద్దరు తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలల్పారు. ఫోబ్ బ్రెట్ బౌలింగ్ త్రిష అవుట్ అయ్యింది. 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. త్రిష తొలి సూపర్ సిక్స్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌వుమెన్‌గా నిలిచింది. ఆ తర్వాత కమలిని, సానిక చల్కే జోడీ టీమిండియా విజయాన్ని ఖరారు చేశారు. భారత్ ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే విజయం సాధించింది. కమలిని 50 బంతుల్లో 56 పరుగులతో రాణించింది. సానికా 12 బంతుల్లో ఒక ఫోర్ సహాయంతో 11 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

ఇంగ్లాండ్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. డేవినా పెర్రిన్, కెప్టెన్ అబి నార్గ్రోవ్ తప్ప ఇతర బ్యాటర్స్ రాణించలేకపోయారు. పెర్రిన్ 40 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 45 పరుగులు చేయగా, నార్గ్రోవ్ 25 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 30 పరుగులు చేసింది. పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మ బంతితో ఆకట్టుకున్నారు. ఇద్దరు చెరో మూడు వికెట్ల పడగొట్టారు. ఆయుషి శుక్లాకు రెండు వికెట్లు దక్కాయి.

# కొత్త జంట.. కలర్ ఫుల్ అంట..!



**టాకీస్:** మలయాళ భామ కీర్తి సురేష్ ఈమధ్యనే తన బాయ్ ఫ్రెండ్ ఆంటోనీని పెళ్లాడిన విషయం తెలిసిందే. 15 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నా సరే ఎక్కడ ఎవరికీ ఏమాత్రం డౌట్ రాకుండా మ్యానేజ్ చేసింది. తెర మీద ఎంతోమంది హీరోలకు ప్రేయసిగా మారిన కీర్తి సురేష్ తన మనసుని మాత్రం భద్రంగా తన ప్రేమికుడికి ఇచ్చేసింది. ఐతే పెళ్లి అయిన వెంటనే బేబీ జాన్ సినిమా రిలీజ్ కోసం ఆ సినిమా ఈవెంట్ లో పాల్గొన్న అమ్మడు ఇప్పుడు మళ్లీ పెళ్లి నాటి విషయాలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. తన సోషల్ మీడియాలో కీర్తి సురేష్ ఆంటోనీతో కలిసి ఆడి పాడి ఎంజాయ్ చేసిన మూమెంట్స్ ని షేర్ చేసింది. కీర్తి సురేష్ ఆంటోని కొత్త జంట కలర్ ఫుల్ గా అనిపిస్తుంది. జంట పక్షులుగా కనిపిస్తున్న ఈ ఇద్దరి ఫోటోలు చూస్తుంటే చూడ ముచ్చటగా ఉంది. పెళ్లి తర్వాత కీర్తి సురేష్ కెరీర్ ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. సౌత్ లో ఒకటి అరా తప్ప పెద్దగా అవకాశాలు లేవు. బేబీ జాన్ సినిమా హిట్ అయితే బాలీవుడ్ లో కెరీర్ కొనసాగించాలని అనుకుంది కానీ ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు కాబట్టి ఇప్పుడు ఏం చేస్తుందో చూడాలి. తెలుగులో ఐతే దసరా, భోళా శంకర్ చేసిన అమ్మడు మళ్లీ ఛాన్సులు రాబట్టలేదు. మహానటి సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్న కీర్తి సురేష్ అప్పటి నుంచి తన స్పీడ్ పెంచేసింది. ఐతే అమ్మడు హిందీలో తన సత్తా చాటాలని అనుకున్నా తొలి సినిమాతోనే రిజల్ట్ నిరాశపరచింది. తమిళ్ లో కీర్తి సురేష్ కి సూపర్ ఫాలోయింగ్ ఉంది. అక్కడ స్టార్ ఛాన్స్ లు వస్తాయి. ఐతే తెలుగులో ఎందుకో అమ్మడు వెనకబడింది. తన న్యాచురల్ యాక్టింగ్ తో సౌత్ ఆడియన్స్ ని తన ఫ్యాన్స్ గా మార్చుకున్న కీర్తి సురేష్ ఈమధ్య గ్లామర్ డోస్ కూడా పెంచి సర్ ప్రైజ్ చేస్తుంది. ఐతే బాలీవుడ్ లో తన గ్లామర్ షో వల్ల కెరీర్ కి ప్లస్ అవుతుందని అనుకోగా నెక్స్ట్ ఏం చేస్తుంది అన్నది చూడాలి. ప్రస్తుతం కీర్తి సురేష్ సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చేలా కనిపిస్తుండగా అప్పటిదాకా అమ్మడి సోషల్ మీడియా అప్డేట్స్ తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేలా ఉంది.

# 'ఎల్‌సీయూ'లో భాగం అవ్వాలని ఉంది : నాగ చైతన్య

**టాకీస్:** యువ నటుడు నాగ చైతన్య తన మనసులోని మాటను బయటపెట్టాడు. తమిళ దర్శకుడు లోకేష్ దర్శకత్వంలో వచ్చిన ఎల్‌సీయూ ఫ్రాంఛైజీలో భాగం కావాలనుందని తెలిపాడు. చైతూ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తండేల్.





సాయి పల్లవి కథానాయికగా నటిస్తుండగా.. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్, బన్ని వాసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ నేపథ్యంలోనే వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. రీసెంట్‌గా చెన్నైలో ఈవెంట్‌ను నిర్వహించగా.. ఈ వేడుకకు నటుడు కార్తీతో పాటు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ హాజరై సందడి చేశారు.

అయితే ఈ మూవీ వేడుకలో నాగ చైతన్య మాట్లాడుతూ.. తన మనసులోని మాటను బయటపెట్టాడు. లోకేష్ కనగరాజ్ తనకు ఇష్టమైన దర్శకుడని.. ఆయన దర్శకత్వంలో వచ్చిన ఎల్‌సీయూ ఫ్రాంఛైజీ(ఖైదీ, విక్రమ్, లియో) సినిమాలు అంటే తనకు చాలా ఇష్టమని తెలిపాడు. నాకు ఛాన్స్ వస్తే.. ఎల్‌సీయూ ఫ్యూచర్ ప్రాజెక్ట్(ఖైదీ 2, రోలెక్స్, లియో 2)లలో భాగం కావాలనుందని తెలిపారు.

# 'లేడీ మన్నార్' ఐకానిక్ ఫోజ్



టాకీస్: తెలుగు కుటుంబంలో జన్మించిన తమిళనాట సెటిల్ అయిన ముద్దుగుమ్మ శ్రీయా రెడ్డి. తమిళ్‌లో పలు సినిమాల్లో హీరోయిన్‌గా నటించి మెప్పించిన ఈ అమ్మడు డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తెలుగులో నటించిన శ్రీయా రెడ్డి సుదీర్ఘ గ్యాప్ తర్వాత టాలీవుడ్‌లో నటించింది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'సలార్' సినిమాలో ఈ అమ్మడు నటించింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు పాతిక ఏళ్లు అవుతున్నా ఈమె అందం మాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 3 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు మరోసారి సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి స్టైలిష్ ఔట్ ఫిట్‌లో ఐకానిక్ ఫోజ్ ఇచ్చింది. క్లీవేజ్ షోతో చూపు తిప్పుకోనివ్వని ఈ అమ్మడి ఫోటోలకు నెటిజన్స్ తెగ ఫిదా అవుతున్నారు. హీరోయిన్స్‌కి ఏమాత్రం తగ్గకుండా ఉన్న ఈ అందంతో ఎందుకు సినిమాల్లో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. అందమైన ఈ అమ్మడి అందానికి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ ఫోటోలను ఫిల్మ్ మేకర్స్ చూస్తే హీరోయిన్‌గా ఆఫర్లు ఇస్తారేమో అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. శ్రీయా రెడ్డి అప్పటి కంటే ఇప్పుడు ఇంకా ఎక్కువ అందంగా ఉందని కొందరు అంటున్నారు. సలార్ సినిమాలో నటించిన తర్వాత ఎక్కువ శాతం శ్రీయా రెడ్డికి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. సలార్ తో పాటు పవన్ కళ్యాణ్ హీరోగా సాహెూ సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఓజీ' సినిమాలోనూ శ్రీయా రెడ్డి ఎంపిక అయ్యింది. కానీ పవన్ కళ్యాణ్ రాజకీయాలతో బిజీగా ఉన్న కారణంగా ఓజీ సినిమా ఆలస్యం అవుతూ వస్తోంది. ఓజీ సినిమాలోనూ తన పాత్ర అత్యంత పవర్ ఫుల్‌గా ఉంటుందని శ్రీయా రెడ్డి గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చింది. అయితే లేడీ విలన్ పాత్రను పోషించారా అనే విషయంపై మాత్రం క్లారిటీ ఇవ్వకుండా సస్పెన్స్‌లో ఉంచింది. గతంలో మాదిరిగా కాకుండా ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇంతటి అందం ఉంచుకుని సోలో హీరోయిన్‌గా సినిమా చేస్తే బాగుంటుంది కదా అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు. హీరోయిన్‌గా బిజీగా ఉన్న సమయంలో పెళ్లి చేసుకున్న శ్రీయా రెడ్డి చాలా గ్యాప్ తీసుకుని రీ ఎంట్రీ ఇచ్చింది. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ చాలా స్లోగా సినిమాలు చేస్తోంది. ఇక ముందు అయినా ఈ అమ్మడు స్పీడ్‌గా సినిమాలు చేస్తుందేమో చూడాలి.

# ఓటీటీలోకి మలయాళీ బ్లాక్ బస్టర్ 'మార్కో'

**టాకీస్:** మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మార్కో. హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది.




డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో కూడా విడుదల చేయగా.. మంచి వసుళ్లను రాబట్టింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'సోనీలివ్'లో వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించింది.

# విజయ్ దేవరకొండ కొత్త సినిమా టైటిల్ ఇదేనా?

**టాకీస్:** రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.



అయితే ఈ మూవీ టైటిల్‌కి సంబంధించి నిర్మాత నాగవంశీ నేడు ఒక పోస్ట్ పెట్టాడు. మీ అందరి (విజయ్ అభిమానుల) నిందల తర్వాత.. నేను గౌతమ్‌ను చాలా హింస పెట్టాక.. ఫైనల్‌గా టైటిల్‌ను లాక్ చేశాం. వీడీ 12 టైటిల్ త్వరలోనే వెల్లడిస్తామని నాగవంశీ ట్వీట్ చేశాడు. అయితే నాగవంశీ ప్రకటించడమే ఆలస్యం ఈ సినిమా టైటిల్ ఇదే అంటూ సోషల్ మీడియాలో ఒక పేరు హల్చల్ చేస్తోంది. ఈ సినిమాకు సామ్రాజ్యం అనే టైటిల్ ఖరారు చేసినట్లు తెలుస్తుంది. తన సామ్రాజ్యం కోసం విజయ్ ఏం చేశాడు.. ? అనే స్టోరీతో ఈ మూవీ రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ మూవీ టైటిల్ చాలా కొత్తగా ఉందని ఫ్యాన్స్ చెప్పుకొస్తున్నారు. మరోవైపు ఈ చిత్రంలో పోలీస్‌తో పాటు ఖైదీగా విజయ్ నటిస్తున్నాడని వార్తలు వస్తున్నాయి.

# పెళ్లి కూతురైన మన్మథుడు హీరోయిన్ అన్షు..

## స్పెషల్ లుక్‌తో సూపర్ హైప్

**టాకీస్:** అక్కినేని నాగార్జున నటించిన మన్మథుడు సినిమాతో హీరోయిన్‌గా సూపర్ ఫేం సంపాదించింది అన్షు. ఈ భామ లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ తెలుగు సినిమాలో నటిస్తుందని తెలిసిందే. టాలీవుడ్ యాక్టర్ సందీప్ కిషన్ ధమాకా ఫేం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం మజాకా. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, అన్షు మరో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

తాజాగా అన్షుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ మూవీ లుక్ ఒకటి విడుదల చేశారు మేకర్స్. ఇందులో అన్షును స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న పెళ్లికూతురు గెటప్‌లో చూడొచ్చు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది.

మాస్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న మజాకా ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఈ మూవీని ఏకే ఎంటర్ టైన్ మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే విడుదల చేసిన మజాకా టైటిల్, ఫస్ట్ లుక్‌లో సందీప్ కిషన్ పంచె కట్టులో సరికొత్తగా కనిపిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాడు.

ఇటీవలే విడుదల చేసిన బ్యాచిలర్స్ ఆంథెమ్ సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. ఇక హీరోహీరోయిన్లు స్టేషన్‌లో ఉన్న సీన్లతో మొదలైన టీజర్.. అక్కడ పోసుకున్నది బీరు కాదండి.. నా ఉసురు అని సందీప్ కిషన్ అంటుంటే.. నాకు తెలియక అడుగుతున్నాను బీర్




బెటరా.. విస్కీ బెటరా అని అడుగుతోంది రీతూవర్మ. దీనికి రకుల్ బెటరా.. రెజీనా బెటరా అంటే ఏం చెప్తానండీ అంటూ రీతూ వర్మ డైలాగ్స్‌తో సినిమా ఫన్ ఎలిమెంట్స్‌తో సాగనున్నట్టు క్లారిటీ ఇచ్చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.